



ఆనందాల కేళి.. దీపావళి

వెలుగుల జిలుగులు.. దీపాలంకరణలతో నిండిన లోగిళ్లు.. టపాకాయల మోతలతో దద్దరిల్లిన పరిసరాలు.. చిన్నా పెద్ద కేరింతలు.. దీపావళి ఆనందాల కేళిగా హోరెత్తింది. శుక్రవారం పల్లెపట్టణం అన్న తేడా లేకుండా దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. వ్యాపారులు తమ దుకాణాలను పూలతో తీర్చిదిద్ది ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి అర్థరాత్రి వరకు టపాసుల మోతలు మిన్నంటాయి.


- బాపట్ల

అమల్లోకి.. అమృత్ 2.0



నరసరావుపేట మున్సిపాల్టీలో ఐదేళ్లుగా నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంక్

అమృత్ పనులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. అమృత్ 2.0తో తిరిగి అమృత్ లక్ష్యాలను సాధించనున్నారు. గత వైసీపీ పాలనలో మున్సిపాల్టీల్లో ఎక్కడికక్కడ నిలిచిపోయిన అమృత్ పనులు తిరిగి పట్టాలెక్కనున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం పురపాలక సంఘాల్లోని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు, మెరుగైన మురుగునీటి పారుదల వ్యవస్థలను అందించాలని లక్ష్యంగా అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే వైసీపీ హయాంలో నిధుల లేమితో పనులు పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమృత్ పథకంపై సమీక్షించింది. గతంలో నిలిచిపోయిన పనుల పూర్తి చేయడంతో పాటు ఆయా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాలు, బలహీనవర్గాల కాలనీల్లో ఇళ్లకు కుళాయి కనెక్షన్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించింది. వీటికి కేంద్రం నుంచి ఆమోదం రావడంతో మున్సిపాలిటీలకు మహర్దశ పట్టింది. త్వరలో ఆయా పనులు ప్రారంభించనున్నట్లు సమాచారం.



- గ్రహణం వీడి.. మున్సిపాల్టీలకు మహర్దశ
- తాగునీరు, పారిశుధ్యం మెరుగునకు ప్రణాళికలు
- బలహీనవర్గాల కాలనీల్లో నీటి సరఫరాకు ప్రాధాన్యం
- వైసీపీ హయాంలో నిలిచిన పనుల పూర్తికి చర్యలు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు రూ.513.58 కోట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పుర ప్రజల తాగునీటి, మురుగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ పథకం తిరిగి పట్టాలెక్కనున్నది. అమృత్ పథకానికి వైసీపీ హయాంలో పట్టిన గ్రహణం వీడనున్నది. అమృత్ పనులను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. తాగునీరు, పారిశుధ్యం మెరుగుదలతో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కల్పించాలన్న అమృత్ పథకం లక్ష్యానికి అనుగుణంగా ప్రతిపాదనలను తయారు చేశారు. అమృత్ 2.0 పథకం కింద పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో రూ.513.58 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మురుగునీటిశుద్ధి ప్లాంట్లు, నీటి సరఫరా కోసం ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, తాగునీటి సరఫరాకు పైపులైన్లు, తాగునీటి నిల్వ చెరువుల అభివృద్ధి, పేదల గృహాలకు కుళాయి కనెక్షన్లు తదితర పనులు చేపట్టనున్నారు. ప్రతి మున్సిపాల్టీలో మురుగునీటిని శుద్ధి చేసి ఆ నీటిని ఇతర అవసరాలకు వినియోగించాలన్నది అమృత్ ప్రధాన లక్ష్యం. అమృత్ పనులు పూర్తయితే పట్టణాల్లో తాగునీరు, మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్నది.

అమృత్ తొలివిడత పనులు ఇలా..

చిలకలూరిపేట, నరసరావుపేట, తెనాలి మున్సిపాల్టీల్లో అమృత్ తొలివిడత కింద 2015, 2016 ఆర్థిక సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో ఆయా మున్సిపాలిటీలలో రక్షిత మంచి నీటి పథకాల విస్తరణ, మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. నరసరావుపేటలో రూ.13.53 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా రూ.5.08 కోట్లతో పైపులైన్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. తాగునీటి కుళాయిలు, నీటి సరఫరా పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంకు పనులు సాగదీస్తునే ఉన్నారు. తెనాలిలో రూ.9.09 కోట్లతో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు. 24,329 కుళాయి కనెక్షన్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 10,873 కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. నీటి పంపిణీ పైపులైన్ల పనులు పూర్తయాయి. చిలకలూరిపేటలో రూ.149.92 కోట్ల పనులు చేపట్టగా నిధుల కొరతతో చాలావరకు పనులు నిలిచిపోయాయి. రూ.7.70 కోట్లతో 4975 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం నెరవెరలేదు. పంపింగ్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు, తదితర తాగునీటి పథకం పనులు పూర్తి చేయలేక పోయారు. రూ.132.11 కోట్లతో సాగర్ ప్రధాన కాల్వ నుంచి పట్టణానికి నీటి సరఫరాకు పైపులైన్ నిర్మాణాన్ని చేపట్టగా అవి 37 శాతమే పూర్తయ్యాయి. తాగునీటి విస్తరణ పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో చిలకలూరిపేట ప్రజలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. మురుగునీటి వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా రూ.10.10 కోట్లతో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో చేపట్టిన ఎస్‌టీపీ పనులు కూడా నిలిచిపోయాయి. మున్సిపల్ వాటా చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మున్సిపల్ ఆస్తులు తనఖా పెట్టి రూ.43 కోట్లు ఏపీయూఎఫ్ఐడీసీ నుంచి రుణం తీసుకున్నారు.

పల్నాడులో రూ.275.55 కోట్లతో పనులు

పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీల్లో రూ.182.42 కోట్ల వ్యయంతో తాగు నీటి పథకాల విస్తరణ, రూ.93.13 కోట్లతో మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి చేసేందుకు అంచనాలను రూపొందించారు. గురజాల నగర పంచాయతీలో రూ.28.28 కోట్లతో తాగునీటి పథకాన్ని విస్తరించనున్నారు. మాచర్ల మున్సిపాల్టీలో రూ.32.30 కోట్లతో తాగు నీటి పథకం అభివృద్ధి చేయనున్నారు. పిడుగురాళ్ల మున్సిపాల్టీలో రూ.20.96 కోట్లు, దాచేపల్లి నగర పంచాయతీలో రూ.24.08 కోట్లు, వినుకొండ మున్సిపాల్టీలో 25.80 కోట్లు, చిలకలూరిపేట మున్సిపాల్టీలో రూ.37.40 కోట్ల వ్యయంతో తాగునీటి పథకాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. చిలకలూరిపేట మున్సిపాల్టీ లో మురుగునీటి సమస్యల పరిష్కారానికి రూ.69.53 కోట్లతో మురుగునీటి శుద్ధిప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారు. రూ.23.60 కోట్లతో నరసరావు పేటలో ప్రస్తుతం అమల్లో ఉన్న భూగర్భ డ్రెయినేజి పథకం విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేశారు.

గుంటూరు జిల్లాకు రూ.157.95 కోట్లు

గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు నగర పాలక సంస్థ, పొన్నూరు, తెనాలి మున్సిపాలిటీలకు 157.95 కోట్లతో అమృత్ 2.0 పనులు చేయనున్నారు. తాగునీటి పథకాల అభివృద్ధి రూ.47.14 కోట్లు, మురుగునీటి సమస్యల పరిష్కారానికి రూ.110.81 కోట్లు వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించారు. గుంటూరు కార్పొరేషన్‌లో రూ.27.21 కోట్ల వ్యయంతో బలహీన వర్గాల కాలనీలకు తాగునీటి పథకాన్ని విస్తరించనున్నారు. పొన్నూరు పురపాలక సంఘంలో రూ.9.90 కోట్లతో తాగునీటి పథకం విస్తరణ, రూ.7.80 కోట్లతో బలహీన వర్గాల కాలనీలకు తాగునీటి వసతి కల్పించనున్నారు. తెనాలిలో రూ.2.23 కోట్లతో పేదల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మురుగునీటి వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి రూ.35.10 కోట్లతో అంచనాలు తయారు చేశారు.

బాపట్ల జిల్లాలో రూ.80.08 కోట్లు వ్యయం

బాపట్ల జిల్లాలో నాలుగు మున్సిపాల్టీలకు రూ.80.08 కోట్లు కేటాయించారు. అద్దంకి మున్సిపాల్టీలో బలహీన వర్గాలు నివసించే కాలనీలకు తాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధికి రూ.4.82 కోట్లు కేటాయించారు. తాగునీటి పథకాలకి చీరాలకు రూ.23.82 కోట్లు, బాపట్లకు రూ.15 కోట్లు కేటాయించారు. రూ.5.24 కోట్లతో బాపట్లలోని బలహీనవర్గాల కాలనీలకు తాగునీటిని సరఫరా చేయనున్నారు. రేపల్లెలో రక్షిత మంచినీటి పథకం అభివృద్ధికి రూ.26.46 కోట్లు, బలహీన వర్గాలకాలనీల్లో తాగునీటి వసతికి రూ.4.74 కోట్ల వ్యయం చేయనున్నారు.

ధరల నియంత్రణకు.. కమిటీ

- నిర్వీర్యమైపోయిన కమిటీల పునరుజ్జీవం
- చైర్‌పర్సన్‌గా కలెక్టర్, మరో 16 మంది నియామకం
- నూతన విధివిధానాలను ఖరారు చేసిన ప్రభుత్వం
- మొక్కుబడి సమావేశాలు కాకుండా ధరల పర్యవేక్షణకు ఆదేశాలు

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ధరల పర్యవేక్షణ, నియంత్రణ, మార్కెట్ ఇంటర్‌వెన్షన్ జిల్లా కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల నుంచి నిర్వీర్యమైపోయిన ధరల నియంత్రణ కమిటీకి పునరుజ్జీవం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే నూతన కమిటీని నియమించి విధివిధానాలను ఖరారు చేసింది. కమిటీకి కలెక్టర్ చైర్‌పర్సన్‌గా నియమించింది. వైస్‌చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా పౌరసరఫరాల అధికారి, సభ్యులుగా వ్యవసాయాధికారి, ఉద్యాన జేడీ/డీడీ, రైతుబజార్ల ఎస్టేట్ అధికారి, వాణిజ్యపన్నుల శాఖ అధికారి, మార్కెటింగ్ డీడీ/ఏడీ, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, వంటనూనెల మర్చంట్స్, పప్పు మిల్లుల సంఘాల అధ్యక్షులు, రైతు సంఘాలు, రైస్‌మిల్లర్లు, హోల్‌సేల్ తిండి గింజల వ్యాపారుల నుంచి ఒక్కొక్కరిని నియమించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. వీరితో పాటు రిటైలర్స్ నుంచి ఒకరు, పరిస్థితిని బట్టి ఇతర సరుకులు విక్రయించే వ్యాపారుల నుంచి ఒకరిని నియమించుకోవాలని సూచించింది. ఇటీవల కాలంలో తరచుగా నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం వంటనూనెల ధర లీటర్‌కు రూ.25కి పైగా పెరిగింది. ఉల్లిపాయలు కేజీ రూ.60 వద్ద కొనసాగుతున్నాయి. వెల్లుల్లి ధర కేజీ రూ.300 పైమాటే. కందిపప్పు రూ.150కి పైగా ఉన్నది. బియ్యం ధరలు కేజీ రూ.50 నుంచి రూ.65 వరకు ఉన్నాయి. ఇకపై మొక్కుబడిగా మూడు, నాలుగు నెలలకు సమావేశాలు నిర్వహణకు పరిమితం కాకుండా నిత్యవసర సరుకుల ధరలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ధరల పరిస్థితి, మార్కెట్‌లో సరుకుల లభ్యతపై ప్రతీ వారం సమీక్షించాలని సూచించింది. ఏదైనా సరుకు ధర పెరిగితే అందుకు దారి తీస్తున్న కారణాలను విశ్లేషించాలి. ఆ వెంటనే ధరలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. సరుకుల బ్లాక్‌మార్కెటింగ్, నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలను అరికట్టాలి. ధరల స్థిరీకరణ ప్రణాళిక రూపొందించి ఎగ్జిక్యూటివ్ కమిటీకి నివేదించాలి. కాగా ప్రణాళికా శాఖ మండల స్థాయిలో కొన్ని ఎంపిక చేసిన సరుకుల ధరలను సేకరించి కన్స్యూమర్ ప్రైస్ మొబైల్ అప్లికేషన్(సీపీ యాప్)లో అప్‌లోడింగ్ చేయాలి. అలానే రైతుబజార్ల ఎస్టేట్ అధికారి కూరగాయల ధరలను ఇదే యాప్‌లో అప్‌లోడింగ్ చేయాలని ప్రభుత్వం సూచించింది.

కార్తీకానికి సూర్యలంక సిద్ధం

6

- భక్తుల తాకిడికి తగ్గట్లు ఏర్పాట్లలో విఫలం
- తాత్కాలిక వసతులతో సరిపెట్టనున్న అధికారులు



రైలు ఢీకొని తల్లీ కూతురు మృతి

4

- కావలి రైల్వే స్టేషన్‌లో ఘటన
- పిట్టలవానిపాలెం మండలం అల్లూరులో విషాదం

- ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభం
- 3,53,461 మందికి లబ్ధి.. ఏడాదికి రూ.87.48 కోట్లు వ్యయం

పేదింట.. దీపం

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల ఇంట ఉచిత గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం దీపావళి తర్వాత రోజే వెలిగించింది. ఎన్నికల్లో ఉచిత గ్యాస్ సిలిండర్లపై ఇచ్చిన హామీ అమలును జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో దీపం-2 పథకం ద్వారా 3,53,461 మంది లబ్ధి పొందనున్నారు. ఒక్కో సిలిండర్ ధర ప్రస్తుతం రూ.825లు ఉన్నందున ఏడాదికి మూడు అంటే ఒక్కో కుటుంబానికి రూ.2,475లు ఆదా అవనున్నాయి. ఐదేళ్లలో ఈ మొత్తం ఒక్కో కుటుంబానికి రూ.12,375 ప్రయోజనం దక్కనుంది. ఈ పథకం ద్వారా ఏడాదికి ప్రభుత్వం మీద జిల్లా వ్యాప్తంగా రూ.87.48 కోట్ల భారం పడనుంది. అదే ఐదేళ్ల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా రూ.437 కోట్లను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయనుంది. దీపం-2 పథకాన్ని కలెక్టర్ వెంకటమురళి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్యతో కలిసి చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో శుక్రవారం ప్రారంభించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, జవాబుదారీతనం, చిత్తశుద్ధితో ప్రభుత్వం పాలన సాగిస్తోందని కలెక్టర్ తెలిపారు. మహిళలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి దీపం-2 పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. కూటమి పాలనలో రాబోయే రోజులన్నీ సుభిక్షంగా ఉంటాయన్నారు

అన్ని నియోజకవర్గాల్లో....


దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్ల పంపిణీలో యంత్రాంగంతో కలిసి కూటమి పార్టీల నేతలు పాలు పంచుకున్నారు. అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామంలో జరిగిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని తెలిపారు. రేపల్లె మండలం పరిధిలోని గుడికాయలంక, అద్దంకి, బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల్లో జరిగిన సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.



ఈపూరుపాలెం గ్రామంలో మహిళలకు సిలిండర్లు అందిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, చీరాల ఎమ్మెల్యే కొండయ్య

దుకాణాలకు 7 వరకు గడువు

- మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సు వ్యాలిడిటీ పెంపు
- నవంబరు 8 నుంచి పర్మినెంట్ లెసెన్సుతోనే వ్యాపారం
- లోకేషన్‌తో పాటు బ్యాంకు గ్యారెంటీల విషయంలో జాప్యం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సుల గడువు మరో వారం రోజుల పాటు పెంచుతూ ఎక్సైజ్ శాఖ నిర్ణయం తీసుకుంది. తొలుత అక్టోబరు 31తో ప్రొవిజనల్ లైసెన్సుల గడువు ముగుస్తుందని, నవంబరు 1 నుంచి పర్మినెంట్ లైసెన్సు ఉంటేనే వ్యాపారం చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కానీ నిర్ణీత గడువు అక్టోబరు 31 నాటికి మద్యం షాపుల లైసెన్సు దారుల నుంచి పర్మినెంట్ లైసెన్సుల కోసం పెద్దగా స్పందన లేదు. ఈ క్రమంలో ఈ నెల 7 వరకు ప్రొవిజనల్ లైసెన్సు వ్యాలిడీటీ పెంచడంతో పాటు నవంబరు 8 నుంచి పర్మినెంట్ లైసెన్సు ఉంటేనే మద్యం వ్యాపారాలు చేసే వీలుంటుందని ఎక్సైజ్ శాఖ తెలిపింది. జిల్లాలో 117 మద్యం షాపులకు ప్రొవిజనల్ లైసెన్సులను అక్టోబరు 15న ఎక్సైజ్ శాఖ సదరు యజమానులకు అందించింది. తొలుత ప్రకటించిన అక్టోబరు 31 గడువు నాటికి 117 షాపులలో పది మంది కూడా పర్మినెంట్ లైసెన్సు ప్రొసీజర్ పూర్తి చేయలేదని సమాచారం. చాలా షాపుల లోకేషన్ విషయంలో యజమానులు ఓ అంచనాకు రాకపోవడం తోడు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించడంలో కూడా జాప్యం జరగడంతో గడువును పొడిగించారు. పెంచిన గడువును ఉపయోగించుకుని నిర్ణీత తేదీలోగా మద్యం షాపులకు పర్మినెంట్ లైసెన్సు పొందాలని ఎక్సైజ్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. లోకేషన్ ఎంచుకునేటప్పుడు ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. క్షేత్రస్థాయి తనిఖీలో భాగంగా షాపు లోకేషన్ విషయంలో నిబంధనలు పాటించలేదని తమ దృష్టికి వస్తే పర్మినెంట్ లైసెన్సు ఇవ్వడం జరగదని అధికారులు తెలిపారు. దీనితో పాటు బ్యాంకు గారెంటీ, కౌంటర్‌పార్టీ అగ్రిమెంట్, షాపు లీజు అగ్రిమెంట్ ఇతరత్రా డాక్యుమెంట్లన్నీ కూడా ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో అందించి నవంబరు 7 కల్లా పర్మినెంట్ లైసెన్సులు పొందాలని మద్యం షాపుల యజమానులను ఎక్సైజ్ శాఖ అధికారులు కోరుతున్నారు.

జంగాకు టీటీడీ బోర్డు పదవి అభినందనీయం


మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి యాదవ్‌ని అఖిల భారత యాదవ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం గుంటూరులోని ఆయన నివాసానికి వచ్చిన అఖిల భారత జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు తాళ్ల నాగరాజు యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జంగాకు సీఎం చంద్రబాబు నాయుడు పదవిని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో తిరుమల తిరుపతి దేవస్థానంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని, అలాగే శరభయ్య యాదవ్ విగ్రహాన్ని తిరుపతిలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరు పేరయ్య యాదవ్, మద్దుల వెంకట కోటయ్య, పెద్దిబోయిన బాలయ్య యాదవ్, కొండేపి శేఖర్ యాదవ్, అలా గంగారావు, చావలి గోపి, తొలుసూరి శివ గండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై బాబాయ్ అత్యాచారం

● గర్భం దాల్చిన బాలిక

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత బాబాయ్ మానవత్వాన్ని మరిచాడు. తన అన్న కుమార్తె అన్న విచక్షణ లేకుండా కామాంధుడిలా బరితెగించాడు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో జరగగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు శుక్రవారం తెలిపారు. పెదకాకానికి చెందిన ఓ వ్యక్తి తన అన్న కుమార్తెపై కన్ను వేశాడు. మాయ మాటలు చెప్పి లోపరచుకొని, గత నాలుగు నెలలుగా బాలికపై అత్యాచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ బాలిక మూడు నెలల గర్భం దాల్చింది. విషయం బహిర్గతం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కాకాని రోడ్డులోని తారకరామ నగర్‌కు చెందిన మాచర్ల హరిబాబు(35) అనే వ్యక్తి పాలిష్ రాళ్ల పని చేస్తుంటాడు. భార్యతో మన స్పర్థలు రావడంతో గడ్డిపాడు సమీపంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు రైలు గేటు వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీన పరుచుకొని మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఫ్లైఓవర్‌పై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసరావుపేటకు చెందిన మల్లాల వీరాంజనేయులు (35) మృతి చెందాడు. అత్తగారి ఊరైన పిడుగురాళ్లకు వచ్చి తెల్లవారుజామున 3.30 నిమిషాలకు నరసరావుపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైనుంచి కిందపడి మృతి చెందాడు. ఎస్ఐ మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసు నుంచి తప్పించేందుకు విఫలయత్నం

● హతురాలి కుమారుడు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

● నిందితుల జాబితాలో నందిగం సురేశ్ పేరు చేర్చని వైనం

● ప్రస్తుత విచారణలో 78 నిందితుడిగా నందిగం

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలోని వెలగపూడి దళిత కాలనీలో జరిగిన మెండెం మరియమ్మ హత్య కేసు నుంచి నాటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్‌ను తప్పించేందుకు పోలీసులు శత విధాల ప్రయత్నించారు. చివరకు కోర్టులను సైతం తప్పుదారి పట్టించేలా వ్యవహరించారు. హతురాలి కుమారుడుతోపాటు కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఎంపీ నందిగం సురేశ్ ప్రోద్బలంతోనే మరియమ్మ హత్య జరిగిందని పేర్కొన్నప్పటికీ పోలీసులు నిందితుల జాబితాలో ఆయన పేరు కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా (ఎ1) సురేశ్‌ను చేర్చాల్సి ఉన్నప్పటికీ పోలీసులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థ అత్యంత దారుణంగా వ్యవహరించిందనడానికి మరియమ్మ హత్య కేసు దర్యాప్తు ఉదంతమే కారణంగా చెప్పుకోవచ్చు.

ఫిర్యాదులో పేర్కొన్నా పట్టించుకోలేదు..

రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయుని పాలెం కు చెందిన నందిగం సురేశ్ వైసీపీ నుంచి బాపట్ల ఎంపీగా గెలుపొందారు. బాపట్ల ఎంపీ అయినప్పటికీ స్థానికంగా రాజధాని ప్రాంతానికి చెందిన వాడు కావడంతో ముఖ్యంగా తుళ్లూరు మండలంపై ఆయన ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. దీనిలో భాగంగా రాజధానిలో కీలక ప్రాంతమైన వెలగపూడిలోని దళిత కాలనీలో ఎస్సీ సామాజిక వర్గంలోని రెండు ఉప కులాల మధ్య ఎప్పటి నుంచో వైరం ఉంది. దళితవాడ మెయిన్ రోడ్డుపై మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఉన్నాయి. మెయిన్ రోడ్డు నుంచి లోనికి వెళ్తే వీరి కాలనీ దాటిన తర్వాత మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారి ఇళ్లు ఉన్నాయి. మాదిగ వర్గానికి చెందిన కుటుంబాలు నందిగం సురేశ్‌ను అనుసరిస్తున్నాయి. ఈ క్రమంలో బాపట్ల ఎంపీగా నందిగం సురేశ్ విజయం సాధించిన తర్వాత ఆ కాలనీలో ఆయన వర్గీయులు హవా కొనసాగించారు. ఆ కాలనీ మెయిన్ రోడ్డుపై ఆర్చ్ నిర్మించాలని సురేశ్ వర్గీయులు నిర్ణయించారు. అంతేగాక ఆర్చ్‌కి బాబు జగ్జీవన్‌రామ్ పేరు పెట్టాలని, ఆ తర్వాత మొత్తం కాలనీ కూడా జగ్జీవన్‌రామ్ కాలనీగా నామకరణం చేయాలని వారు భావించారు. అయితే తాము నివాసం ఉండే తమ ఇళ్ల వద్ద మీరు ఎలా ఆర్చ్ కట్టుకుంటారని, మీ ఇళ్ల వద్ద మీరు ఆర్చి కట్టుకోవాలని మాల సామాజిక వర్గానికి చెందినవారు అభ్యంతరం చెప్పారు. ఈ విషయంలో ఆ రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీంతో 2020 డిసెంబర్ 24న ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ విషయం మనసులో పెట్టుకున్న ఇరువర్గాలు అదే నెల 27న మరోసారి గొడవపడి రాళ్లు రువ్వుకున్నాయి. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన పలువురికి తలలు పగిలాయి. నందిగం సురేశ్ వర్గీయులు చేసిన దాడిలో ప్రత్యర్థి వర్గానికి చెందిన మెండెం మరియమ్మ తలకు బలమైన రాయి తగిలింది. ఆసుపత్రికి వెళ్లే సమయానికి ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై మరియమ్మ కుమారుడు మెండెం బాబు తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీ నందిగాం సురేశ్ ప్రోద్బలంతోనే తమపై దాడి చేసి తన తల్లి మరియమ్మను హత్య చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదులో ఎంపీ నందిగం సురేశ్‌తోపాటు మరో 36 మంది పేర్లను పేర్కొన్నారు. అయితే పోలీసులు క్రైం నంబర్ 390/2020 గా నమోదు చేసిన కేసులో ఐపీసీ 147, 148, 302, 109 రెడ్ విత్ 149 సెక్షన్లను పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పది మంది నిందితుల పేర్లను పేర్కొన్నారు. మిగిలిన వారి పేర్లు రాయకుండా నిందితులుగా పేర్కొన్నారు. వాస్తవానికి మరియమ్మ కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నందిగం సురేశ్‌ను ప్రధాన నిందితుడిగా (ఎ1) చేర్చాల్సి ఉంది. రాజకీయ ఒత్తిళ్లతో ఆ పేరు చేర్చలేదు. అలాగని ఆయన నిందితుడు కాదని కూడా పేర్కొనలేదు. ఫిర్యాదులో పేర్కొన్న వారంతా నిందితులు గానే పేర్కొన్నారు. అంతేగాక పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న సెక్షన్ 109 అనేది ఒకరి ప్రోద్బలంతో హత్య జరిగినట్లు సూచిస్తుంది. ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ ప్రోద్బలం అనేదానికి సెక్షన్ 109 వర్తిస్తుంది. అయితే నిందితుల జాబితాలో మాత్రం ఆయన పేరును చేర్చలేదు.

77కు చేరిన నిందితుల సంఖ్య

ఆ తర్వాత జరిగిన కేసు విచారణలో పోలీసులు మరో 41 మందిని నిందితులుగా గుర్తించి నిందితుల జాబితాలో చేర్చారు. చట్ట ప్రకారం కనీసం ఎ1 గా చేర్చకపోయినప్పటికీ మిగిలిన 41 మంది నిందితుల జాబితాను చేరుస్తున్న సమయంలో 37వ నిందితుడిగా చేర్చి ఆ తర్వాత మిగిలిన 41 మంది పేర్లతో జాబితాను తయారు చేయాల్సి ఉంది. అలా చేయకుండా సురేశ్ పేరు తప్పించి 36 మందిని నిందితులుగా చేర్చి ఆ తర్వాత గుర్తించిన 41 మంది పేర్లను కూడా చేర్చారు దీంతో ఈ కేసులో నిందితుల సంఖ్య 77గా పేర్కొన్నారు. ఆ కేసులో మొదట నిందితులుగా గుర్తించిన 36 మందిలో ఒకరిద్దరూ ముందస్తు బెయిల్ తెచ్చుకోగా ఒకరు మృత్యువాత పడ్డారు. మిగిలిన 41 మందిని నిందితులుగా చేర్చినప్పటికీ నాలుగేళ్ల పాటు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు. కోర్టులో ఛార్జిషీటు కూడా దాఖలు చేయలేదు. అయితే మిగిలిన 41 మందిని నిందితుల జాబితాలో చేర్చిన తర్వాత నిందితుల బెయిల్ పిటిషన్ సందర్భంగా పోలీసులు వేసిన పిటిషన్‌లో అయా నిందితులకు బెయిల్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పేశారు.

పీటీ వారెంట్‌పై అరెస్టు

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసులో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు ఆ కేసు ఫైల్ ను బయటకు తీశారు. అప్పటి డీఎస్పీ జె.శ్రీనివాసరావు అత్యంత దారుణంగా వ్యవహరించినట్లు పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు. కాగా తుళ్లూరు సీఐగా నియమితులైన గంగా వెంకటేశ్వర్లు కేసును దర్యాప్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా హతురాలి కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదుతో పాటు శవ పంచనామ సమయంలో అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదులోనూ, అదేవిధంగా వారి కుటుంబ సభ్యులు నలుగురు పోలీసులకు ఇచ్చిన స్టేట్మెంట్ లోనూ నందిగం సురేష్ పేరు స్పష్టంగా ఉంది. వాటన్నింటిని పరిగణలోకి తీసుకున్న సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో 78వ నిందితునిగా సురేశ్ పేరు చేర్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితునిగా జిల్లా జైలులో ఉన్న నందిగం సురేశ్‌ను ఈ హత్య కేసులో పీటీ వారెంట్‌పై అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవలే సురేష్‌ను తుళ్ళూరు పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. విచారణకు సురేశ్ సహకరించలేదని పోలీసులు తెలిపారు.

ఆస్తి కోసం కన్నకొడుకునే కడతేర్చిన తల్లి


వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు

క్రోసూరు, నవంబరు 1 (అంధ్రజ్యోతి): కొద్దిపాటి ఆస్తికోసం కన్నకొడుకునే బంధువులు, మరో కుమారుడితో కలిసి హత్య చేయించింది ఓ కసాయి తల్లి. క్రోసూరు మండలం హసానాబాద్‌లో అక్టోబరు 27 రాత్రి జరిగిన ఈ సంఘటనలో పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హసానాబాద్‌కు చెందిన షేక్ మున్నీబీకి ఇద్దరు భర్తలు ఉండేవారు. సుమారు 20 ఏళ్ల క్రితం విడిపోయిన మొదటి భర్తకు షేక్ మహబూబ్ బాషా అనే కుమారుడు ఉన్నాడు. తర్వాత వివాహం చేసుకున్న రెండో భర్తకు షేక్ అబ్దుల్ బాషిత్, షేక్ పాతిమా సంతానం ఉన్నారు. పెద్ద కుమారుడు మహబూబ్ బాషాకు విడిపోయిన భర్త ద్వారా ఎకరం 50 సెంట్ల పొలం, ఐదు సెంట్ల స్థలం, తాత ద్వారా అర ఎకరం పొలం వచ్చింది. రెండో భర్త కుమారుడు బాషిత్‌కు 50 సెంట్ల పొలం, 25 సెంట్ల స్థలం రెండో భర్త ద్వారా వచ్చింది. రెండో భర్త 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. పెద్ద కుమారుడికి ఎక్కువ ఆస్తి, రెండో కుమారుడికి తక్కువ ఆస్తి రావడాన్ని తల్లితో సహా, రెండో కుమారుడు, బంధువులు జీర్ణించుకోలేక పోయారు. ఆస్తి మొత్తం కలిపి సమానంగా పంచుకుందామని తరచూ గొడవలు పడుతుండేవారు. పెద్ద కుమారుడు మహబూబ్ బాషా దీనికి ససేమిరా అనడంతో అతన్ని ఎలాగైనా కడతేర్చి ఆస్తి కాజేయాలని పథకం పన్నారు. అక్టోబరు 27 రాత్రి షేక్ అబ్దుల్ బాషిత్, తల్లి షేక్ మున్నీబీ, బంధువులు జైలూలబ్దీన్, నాగుల్ మీరా, నన్నే సాహెబ్, మాబు సుభాని, మహబూబ్ సుభాని, కరీముల్లా, పెద్ద బాజీ, నుషరత్, మరో నలుగురు కలిసి కర్రలు, ఇనుప రాడ్లు, కారం, మొదలైన వాటితో మహబుబ్ బాషా ఇంటికి వెళ్లి విచక్షణా రహితంగా కొట్టారు. అడ్డుకోబోయిన భార్య షేక్ కౌషర్, మామ చిన్నబాజీ, ఆర్నెల్ల చిన్నారిపై కూడా దాడి చేశారు. గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్టోబరు 28న ఉదయం మహబూబ్ బాషా మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు పర్యవేక్షణలో సీఐ పి.సురేష్, క్రోసూరు ఎస్ఐ కె.నాగేంద్రరావు, మరో నలుగురి కానిస్టేబుల్‌తో కూడిన బృందం పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు, వారి నుంచి ఇనుప రాడ్లు, మోటారు సైకిల్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను సత్తెనపల్లి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపినట్లు తెలియజేస్తూ 48 గంటల్లో నిందితులను అరెస్టు చేసిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మళ్లీ గోడదూకి పారిపోయిన విద్యార్థులు


బోయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల


యడ్లపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు గోడదూకి పరారయ్యారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఏడుగురు విద్యార్థులు శుక్రవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో పాఠశాల ప్రహరీ గోడ దూకి వెళ్లారు. ఈ ఏడాది సెప్టెంబరు 23న పదో తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులు పాఠశాలలో సౌకర్యాలు బాగాలేవని, రాత్రిపూట భోజనం సరిగా ఉండడంలేదని, తమను అనవసరంగా కొడుతున్నారంటూ గోడ దూకి కొండవీడు కొండలవైపు పరుగు పెట్టారు. పోలీసులు, స్థానికుల సహకారంతో విద్యార్థులను పట్టుకుని పాఠశాలకు తరలించారు. ఈ విషయం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో విచారణకు త్రిసభ్య కమిటీని వేశారు. విచారించిన కమిటీ సంఘటనకు కారకులంటూ 5గురు పార్టుటైం ఉపాధ్యాయులను తొలగింపునకు సిఫారసు చేయగా ఉన్నతాధికారులు వారిని తొలగించి చేతులు దులుపుకున్నారు. అయితే సంఘటనకు ప్రధాన కారకులు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ అని వారిని ఇక్కడ నుంచి వేరొచోటుకు మార్చాలని విద్యార్థులు చేసిన డిమాండ్‌ను అధికారులు పట్టించుకోలేదు. దీంతో మరో మారు అవే కారణాలతో విద్యార్థులు పరారయ్యారు. అయితే ఈ సారి విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వెళ్తూ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారిలో నలుగురు విద్యార్థులు తల్లిదండ్రులు వచ్చేవరకు బోయపాలెంలో ఉండి వారితో కలసి పాఠశాలకు రాగా మిగిలిన ముగ్గురు తుర్లపాడులోని స్నేహితుని ఇంటికి వెళ్లినట్లు తెలుసుకుని పోలీసుల సహకారంతో పాఠశాలకు తీసుకొచ్చారు.


విద్యార్థులను ప్రేరేపించడంతోనే సమస్య

విద్యార్థులను కొందరు ఉపాధ్యాయులు రెచ్చగొట్టడం వల్లనే సమస్య ఏర్పడిందని డీసీవో పద్మజ అన్నారు. కొందరు విద్యార్థుల ప్రవర్తన దారుణంగా ఉందనీ, వారం రోజుల కిందట 10 మంది విద్యార్థులను ఇంటికి పంపించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని అడిషనల్ సెక్రటరీకి నివేదించామని, వారి నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అవే కారణాలతో విద్యార్థులు మళ్లీ ఎందుకు పారిపోయారంటూ విలేకరులు ప్రశ్నించగా గతంలో రెచ్చగొట్టిన ఉపాధ్యాయుల ప్రేరణ విద్యార్థుల్లో అలానే ఉండడంతో ఇలా ప్రవర్తించారంటూ విద్యార్థులదే తప్పంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. సంఘటన జరిగిన తరువాత కూడా పాఠశాలలో ఉండాల్సిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉండడం లేదు కదా, వారు స్థానికంగా ఉంటే ఈ సమస్యలు రావు కదా అని ప్రశ్నించడంతో ఇక్కడే ఉంటున్నారంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

రైలు ఢీకొని తల్లీ కూతురు మృతి

● కావలి రైల్వే స్టేషన్‌లో ఘటన


వజ్రమ్మ (ఫైల్ ఫొటో)


శిరీష (ఫైల్ ఫొటో)

పిట్టలవానిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని తల్లీ కూతురు మృతి చెందిన ఘటన కావలి రైల్వే స్టేషన్‌లో జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా అల్లూరుకు చెందిన నత్తల వజ్రమ్మ(60) కావలి పట్టణంలోని బర్మాషల్ వీధిలో నివాసం ఉంటున్న కుమార్తె గర్నెపూడి శిరీష(35) వద్దకు వచ్చింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు గురువారం తెల్లవారుజామున బయలుదేరింది. తల్లి నత్తల వజ్రమ్మను తీసుకుని స్వగ్రామంలో వదిలి వచ్చేందుకు తల్లితోపాటు కుమార్తె రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అయితే ఒంగోలు వైపు వెళ్లే రైళ్లు 3వ నంబరు ప్లాట్‌ఫాం మీదకు వస్తుండటంతో తల్లీ కూతురు 3వ నంబరు ప్లాట్‌ఫాంపై ఆగారు. అయితే బిట్రగుంట నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలు 1వ నంబరు ప్లాట్‌ఫాంపైకి వస్తున్నట్లు రైల్వే అధికారులు అనవున్స్‌మెంట్ చేయడంతో వారివురు 3వ నంబరు ప్లాట్‌ఫాం నుంచి 1వ నంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చేందుకు పట్టాలపై దిగారు. కుమార్తె శిరీష ముందుగా 2వ నంబరు ప్లాట్‌ఫాంపైకి ఎక్కింది. ఆమె తల్లి వజ్రమ్మ ఎక్కలేకపోగా అదే సమయంలో ఆ పట్టాలపై రైలు వస్తుండడంతో తల్లిని కాపాడేందుకు ప్లాట్‌ఫాం దిగి ఆమెను పైకి ఎక్కించే క్రమంలో కొయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి వారిని ఢీకొంది. దీంతో ఇరువురి మృతదేహాలు పట్టాలపై చల్లాచెదరుగా పడ్డాయి. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వజ్రమ్మ మృతదేహాన్ని అల్లూరు గ్రామ పంచాయతీలోని నత్తలవారిపాలెం గ్రామానికి, శిరీష మృతదేహాన్ని నాదెండ్ల మండలం తిమ్మాపురం గ్రామానికి తీసుకెళ్లారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేటు

● అర్బన్ బ్యాంకు చైర్మన్ శ్రీనివాస యాదవ్



గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్లపై అత్యధిక వడ్డీరేటు చెల్లిస్తున్నామని ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్ తెలిపారు. స్వల్ప, దీర్ఘకాలిక పరిమితిని బట్టి వడ్డీరేట్లు అమలు చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు అదనంగా చెల్లింపులు చేస్తున్నామని చెప్పారు. ఖాతాదారుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తూ బ్యాంకుని లాభాల బాట పట్టించిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఫటా ఫట్

అర్బన్ బ్యాంకులో వడ్డీరేట్లు ఎలా ఉన్నాయి?

చైర్మన్: 30 నుంచి 90 రోజుల వరకు సాధారణ పౌరులు, సీనియర్ సిటిజన్స్‌కి 5.50 శాతం, 91 నుంచి 180 రోజులకు సాధారణ పౌరులకు 6.50 శాతం, సీనియర్ సిటిజన్స్‌కి 7 శాతం, 181 రోజుల నుంచి 12 నెలల్లోపు 7.50 శాతం, 8 శాతం, 12 నెలల నుంచి 36 నెలల వరకు 8.50 శాతం, 9 శాతం, 36 నెలలపైన 8.60 శాతం, 9.10 శాతం చెల్లిస్తున్నాం.

రుణాలు ఎన్ని కేటగిరీల్లో ఇస్తున్నారు?

చైర్మన్: మార్టిగేజ్, హోం, గోల్డ్, ప్రాజెక్టు ఫైనాన్స్, ఓవర్ డ్రాఫ్టు, అర్బన్ షార్ట్ టర్మ్, వెహికల్, ఎడ్యుకేషన్ రుణాలు అతి తక్కువ వడ్డీతో ఇస్తున్నాం.

డిజిటల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయా?

చైర్మన్: ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్, ఏపీటీఎస్, ఆర్‌టీజీఎస్/ఎన్ఈఎఫ్‌టీ, ఏ బ్రాంచ్‌లోనైనా బ్యాంకింగ్, డిమాండ్ డ్రాఫ్టు అండ్ పే ఆర్డర్, సీటీఎస్ క్లియరింగ్, పాజిటివ్ పే, యూపీఐ, ఏసీహెచ్ క్రెడిట్ డెబిట్, ఐఎంపీఎస్, మొబైల్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్ పేమెంట్ స్కానర్ కోడ్, మొబైల్ అప్లికేషన్లు అందుబాటులోకి తీసుకొచ్చాం.

మొండి బకాయిల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టారు?

చైర్మన్: బ్యాంకు సిబ్బంది అందరిలో జవాబుదారితనాన్ని పెంచాం. సీసీటీవీ సర్వైలెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు వారి పనితీరుని గమనిస్తున్నాం. రుణాల రికవరీ బాధ్యత అప్పగించి మొండిబకాయిదారుల ఇళ్లకు పంపిస్తున్నాం. బాధ్యతారహితంగా విధులు నిర్వహించే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

టీటీడీ బోర్డు సభ్యుడిగా నన్నపనేని



తుళ్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యుడిగా తుళ్లూరు మండలం దొండపాడు గ్రామానికి చెందిన నన్నపనేని సదాశివరావును కూటమి ప్రభుత్వం నియమించింది. నాట్కో ఫార్మా సంస్థ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న సదాశివరావు అనేక స్వచ్ఛంద సేవా కార్యాక్రమాలను నిర్వహించారు. పదిహేను సంవత్సరాల క్రితమే దొండపాడులో నాట్కో సంస్థ తరుపున శుద్ధ తాగు జల కేంద్రం ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందజేశారు ఇప్పటికీ ఆ మినరల్ ప్లాంట్ నుంచి కేవలం రూ.2లకే 20 లీటర్ల అందిస్తున్నారు. వెంకటపాలెం చిగురు అనాథ బాలల ఆశ్రమ సంక్షేమానికి భారీ విరాళాలు అందించారు. గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ డయోగ్నస్టిక్ యూనిట్‌ను నాట్కో సంస్థ తరుపున బిల్డింగ్‌ను నిర్మాణం చేసి ఉచితంగా వైద్య సేవలు అందించటంలో నన్నపనేని సదాశివరావు కృషి చేశారు. ఇవే కాక వివిధ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు అమలు చేయటంలో నన్నపనేని సదాశివరావు పేరు సంపాదించారు. సీఎం చంద్రబాబు నాయుడు సదా శివరావు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి గురువారం టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. సమాజ సేవా దృక్పథం, రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు ప్రాధాన్యతనిస్తూ ఆ ప్రాంతానికి చెందిన నన్నపనేని సదాశివరావుకు పదవిని కేటాయించటంపై రైతు జేఏసీ నాయకులు, రైతులు, రైతు కూలీలు, మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

థాయిలాండ్ అంతర్జాతీయ సదస్సుకు వర్సిటీ అధ్యాపకులు

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): థాయిలాండ్, బ్యాంకాక్‌లో ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న 'పరిశోధన - ఆవిష్కరణలపై' అంతర్జాతీయ సమావేశానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎకనామిక్స్ విభాగాధిపతి, పీజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కడిమి మధుబాబు, వర్సిటీ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య బి.నాగరాజు హాజరు కానున్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్ నుంచి అధికారిక ఆహ్వాన పత్రిక అందినట్లు ఆచార్య మధుబాబు తెలిపారు. యురేషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, షినవత్రా విశ్వవిద్యాలయం, పాతుమ్ థాని, థాయిలాండ్, రిసెర్చ్ కల్చర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని చెప్పారు. సదస్సులో "స్వచ్ఛ భారత్ మిషన్ అండ్ ఇట్స్ రోల్ ఇన్ ట్రాన్స్ఫార్మింగ్ రూరల్ శానిటేషన్ ఇన్ ఇండియా" అంశంపై ఆచార్య మధుబాబు, "ఎక్స్ప్లోరింగ్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఫర్ వుమెన్ ఎంప్లాయిస్: ఏ కే స్టడీ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వే" అంశంపై డాక్టర్ నాగరాజు పరిశోధన పత్రం సమర్పణకు అనుమతి లభించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రం సమర్పించనున్న ఆచార్య మధుబాబు, ఆచార్య నాగరాజులను వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఉరి వేసుకొని గొర్రెలకాపరి ఆత్మహత్య

పిట్టలవానిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు కాచే ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మంతెనవారిపాలెం గ్రామపంచాయతీకి చెందిన ముకిరి కోటయ్య (21) గొర్రెల కాపరిగా పనిచేస్తున్నారు. తన ఇంటి ప్రాంతంలో ఉన్న ఓ వ్యక్తికి సంబంధించిన రెండు గొర్రెలను తన గొర్రెలతోపాటు కోటయ్య అమ్ముకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ వ్యక్తి మృతుడిపై దౌర్జన్యంగా మాట్లాడి పోలీసుస్టేషన్‌లో కేసుపెడతానని బెదిరించాడని, దీనికి మనస్తాపం చెంది ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట నవంబరు 1 (ఆంధ్రజోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టియంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,137 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 30,234 క్యూసెక్కుల నీరుదిగువ కృష్ణకు విడుదలౌతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి చేరుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

18,503 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 12,825 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 18,503 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,157 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000	334	9500	15500
నెంబరు. 5	8000	9200	నెంబరు. 5	--	--
273	--	--	273	15500	15500
341	8800	14500	341	9000	13500
4884	12000	12000	4884	11800	16500
సూపర్ 10	--	--	సూపర్ 10	10000	15700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	18200	తేజ	10000	18000
బ్యాడిగి	9000	15500	బ్యాడిగి	9000	14600
దేవనూరు డీలక్స్	--	--	దేవనూరు డీలక్స్	10500	12000
తెల్లకాయలు	5000	10000	తెల్లకాయలు	6000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

వనమహోత్సవంలో మొక్కలు పంపిణీ

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో వనమహోత్సవం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ పార్టీశ్రేణులతో కలిసి మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరమళ్ళ సుజిత్, షేక్ మున్నా, దాదా, సంజయ్, కరీముల్లా, చంద్రశేఖర్, పానకాల రావు, జిడుగు మాధురి పాల్గొన్నారు.

శ్రీమహర్షి ఆశ్రమ గోశాలలో కాలభైరవ హోమం

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీమహర్షి ఆశ్రమగోశాలలో శుక్రవారం, అమావాస్య స్వాతినక్షత్రం సందర్భంగా అష్టభైరవ సహిత కాలభైరవ హోమం నిర్వహించారు. కలశస్థాపన, గోమయ, అష్టభైరవలు, ఆవాహన స్థాపన చేయటం జరిగింది. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలభైరవుడికి విశిష్టమైన రోజు హోమం 8 దిక్కుల కోష్మాండదీపాలు వెలిగించారు. శ్రీసంపత్ గణపతి పరివార్ సభ్యులు బి.బాబునాగేంద్ర, శ్రీహరినారాయణ, కావూరి శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకట్, మామిడి రాజశేఖర్, భ్రమరాంబ, శ్రీలక్ష్మీ, వీరకుమారి, సరిత, ఉషమ్మ, జ్యోతిర్మయి, శ్రీనివాసరావు, బాను తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజి కోర్సుతో ఉపాధి అవకాశాలు

బాపట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఫుడ్ టెక్నాలజి కోర్సు చదవటం వల్ల అనేక రకాలైన ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధి అవకాశాలు లభిస్తాయని విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ అధ్యక్షతన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు దీక్షారంబ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజి అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇంజనీరింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వినోద్, బోధన,బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు మెంబర్ శాంతరావుకు అభినందనలు

వేమూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ బోర్డు మెంబరుగా కుప్పం నియోజకవర్గానికి చెందిన ఏపీ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వైద్య శాంతరావును నియమించడంపై వేమూరు నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సంఘ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు నాయీబ్రాహ్మణులకు ఆలయాల పాలకమండలిలో సముచిత స్థానం కల్పిస్తానని చెప్పి ఆ మాటలు నిలబెట్టుకున్నందుకు సంఘ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేమూరు నియోజకవర్గ సంఘ నాయకులు శివలింగప్రసాద్, వల్లూరి సుబ్రహ్మణ్యం, తులం రమేష్, తులం వెంకటేశ్వరరావులు అభినందించిన వారిలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సూరేపల్లి విద్యార్థిని ఎంపిక


మోర్ల అక్షర

భట్టిప్రోలు(కొల్లూరు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సూరేపల్లి విద్యార్థిని ఎంపికైంది. మంగళగిరి మండలం నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎంపికలో సూరేపల్లి పాఠశాల విద్యార్థిని మోర్ల అక్షర ఎంపికైంది. ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు క్రీడాకారిణి ప్రాతినిధ్యం వహించనుం ది. ఈ సందర్భంగా పాఠశాల పాలకవర్గ అధ్య క్షుడు యేపూరి చలమయ్య, కార్యదర్శి వెంకటకృష్ణారావు, విద్యార్థినితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వరరావును అభినందించారు.

తీరంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాం

● కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసంలో సూర్యలంక సముద్రతీరంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు.

ఫటా ఫట్

ఎంతమంది కార్మికులను కేటాయించారు?

కమిషనర్ : పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సూర్యలంక తీరానికి 40 మంది కార్మికులను కేటాయించాం. కార్తీక పౌర్ణమి, సోమవారం రోజుల్లో అవసరాన్ని బట్టి మరో 20 మందిని ఏర్పాటు చేస్తాం.

పట్టణ పారిశుధ్య నిర్వహణ పరిస్థితి ఏమిటి?

కమిషనర్ : పట్టణ పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహించే వారు అలాగే ఉంటారు. సూర్యలంక తీరంలో పనులు చేసేందుకు అదనంగా కార్మికులను తీసుకోవటంతోపాటు ఒక ట్రాక్టర్‌ను కూడా లీజుకు తీసుకున్నాం.

నిర్వహణకు అయ్యే ఖర్చు ఎవరు పెట్టుకుంటారు?

కమిషనర్ : పారిశుధ్య పనుల నిర్వహణకు అయ్యే ఖర్చు మున్సిపల్ సాధారణ నిధులు నుంచి కేటాయిస్తాం. గతంలో కూడా మున్సిపాలిటి నుంచి పారిశుధ్య పనులు నిర్వహించారు. దీనికి సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుంది.

ఇంకా ఏమేమి పనులు నిర్వహిస్తారు?

కమిషనర్ : తీరానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు కార్తీకమాసం మొత్తం తాగునీటిని సరఫరా చేస్తాం. ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిస్తాం. అక్కడ క్యాన్‌లు ఏర్పాటు చేసుకొని పట్టుకోవాల్సి ఉంది.

పనులలో ఎవరెవరు భాగస్వాములౌతున్నారు?

కమిషనర్ : అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ తీరంలో కార్యక్రమాలు నిర్వహిస్తాం. అడవిపంచాయతీకి సంబంధించి ఐదుగురు మాత్రమే పారిశుధ్య కార్మికులు ఉన్నారు. కావున తప్పనిసరిగా పురపాలక సంఘ సహకారం అందించాల్సి ఉంది.

కార్తీక మాసానికి ముస్తాబైన శివాలయాలు

● భక్తుల కోసం ప్రత్యేకషెడ్డులు, స్నానఘాట్‌లు


ముస్తాబైన మోర్తోట కృష్ణానది ఒడ్డున ఉన్న ముక్తేశ్వరస్వామి ఆలయం

రేపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని దక్షిణ కాశీగా పేరొందిన గంగాపార్వతి సమేత మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా తెల్లవారుజామున 5 గంటల నుంచి విఘ్నేశ్వరపూజ, రుద్రాభిషేకం జరుగుతుంది. భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించేందుకు పుష్కర ఘాట్‌వద్ద ఏర్పాట్లు చేశారు. దుస్తులు మార్చుకుని విశ్రాంతి తీసుకునేందుకు షెడ్లను ఏర్పాటు చేశారు. ఆలయాల్లో భక్తుల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అన్ని శివాలయాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆయా దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

భక్తులకు తగిన వసతులు కల్పించాలి : ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, నవంబరు 01 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో సూర్యలంక సముద్రతీరానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశించారు. పార్టీశ్రేణులు, అధికారులతో కలిసి గురువారం సూర్యలంక సముద్రతీరంలో ఆయన పర్యటించారు. ఆహ్లాదకరంగా తీరాన్ని శుభ్రం చేయించి అవసరమైన మరుగుదొడ్లు, స్నానాల గదులు, తాగునీటి సౌకర్యం వంటివి ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు మందపాటి అంద్రేయ, పోలీసు, మెరైన్ సిబ్బంది ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.


సూర్యలంక తీరంలో కార్తీకమాసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకే డ్వాక్రా సంఘాలు

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


మహిళలకు ఉచిత సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు డ్వాక్రా సంఘాల సృష్టికర్త ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిగా ప్రవేశ పెట్టారని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని ఇంటూరులో దీపం పథకం-2లో భాగంగా సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రెండో పథకాన్ని అనతి కాలంలోని చంద్రబాబు ప్రారంభించారన్నారు. ఉచిత సిలిండర్ల పథకం వలన సంవత్సరానికి ప్రభుత్వం రూ.2684 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. జగన్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి 10 లక్షల 60 వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్రంను అధోగతి పాలు చేశాడన్నారు. ప్రస్తుతం రూ.850 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామ స్థాయిలో 13 మంది గ్యాస్ బుక్ చేసుకున్న మహిళలకు ఉచిత సిలిండర్లును అందించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ కూచిపూడి నెప్రాంబాబు, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, సర్పంచ్ మద్దు జీవమణి, పార్టీ నాయకులు కాట్రగడ్డ లక్ష్మీప్రసాద్, బోరుగడ్డ శామ్యేలు, శరణుగిరి, పాములపాటి వెంకట సుబ్బారావు, బుచ్చిబాబు, బోరుగడ్డ ఆనంద్, సుబ్బయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● బాపట్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలో దీపం పథకం-2 కింద ఉచిత గ్యాస్ సిలెండర్లు లబ్ధిదారులకు ఎంపీడీవో బాబురావు ఆధ్వర్యంలో సీనియర్ టీడీపీ నాయకులు సలగల రాజశేఖర్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలలో భాగంగా అర్హత కలిగిన లబ్ధిదారులకు విడతల వారీగా సంవత్సరానికి మూడు సిలిండర్లను అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల తహసీల్దార్ సలీమా, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, చెన్నుపాటి కిషోర్, నామన శివన్నారాయణ, కాగిత నాగభూషణమ్మ, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళాభివృద్ధే టీడీపీ కూటమి ప్రభుత్వం ధ్యేయమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం గుడ్డికాయలంక, నిజాంపట్నం మండలం అడవులదీవి, చెరుకుపల్లి మండలం నడింపల్లి గ్రామాల్లో దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలెండర్లను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎన్నికల వాగ్దానంలో సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందిస్తామని ఇచ్చిన హామీని దీపావళి పండుగను పురస్కరించుకుని అందిస్తున్నామన్నారు. డ్వాక్రా గ్రూపుల్లో వడ్డీ లేని రుణాలను అందించి వారికి అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు, నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, శొంఠి శీనివాసరావు, మేకా రాజేష్ కన్నా, మొహమాటం రాధాకృష్ణమూర్తి, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.


ఉచిత గ్యాస్ సిలెండర్‌ను అందిస్తున్న మంత్రి సోదరుడు అనగానిశివప్రసాద్

● వేమూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెల్లరేషన్ కార్డు ఉండి అర్హులైన వారందరికి ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు ప్రారంభించారు. బాపట్ల జిల్లా గ్యాస్ ఏజెన్సీల సంఘం అధ్యక్షుడు శరత్ గ్యాస్ మేనేజర్ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయబాబు మాట్లాడుతూ, సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, రెవెన్యూ శాఖ సిబ్బంది లబ్దిదారులైన మహిళలు పాల్గొన్నారు.


పదవీవిరమణ పొందిన ఎస్‌ఐను సన్మానిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

పదవీవిరమణ పొందిన వారు ఆరోగ్యంపై దృష్టి సారించాలి : ఎస్పీ

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పదవీవిరమణ పొందిన అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు ఎస్‌ఐలకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బి.మాణిక్యారావు దంపతులను ఘనంగా సత్కరించి ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదని, ప్రజలకు నేరుగా సేవలందించటం పోలీసు ఉద్యోగంలో జరుగుతుందన్నారు. అలాంటి ఉద్యోగంలో చేరటం గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. పోలీసుశాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్‌ఐ డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రా షెల్లి దేవులపల్లి కృష్ణ శాస్త్రి : రావూరి

బాపట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు నా ఇచ్ఛయేగాక నాకేటి వెరపు' అంటూ భావ కవిత్వాన్ని సమకాలిక కవులు ఎంతగానో విమర్శించిన ప్రాచుర్యానికి దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి ఎంతగానో కృషి చేశారని, ఆంధ్రా షెల్లి దేవులపల్లి కృష్ణశాస్త్రి అనిసాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ శుక్రవారం అన్నారు. దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి 127వ జయంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావులు సంయుక్తంగా మాట్లాడుతూ దేవులపల్లి కళాప్రపూర్ణ, పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులతో సత్కరింపబడ్డారన్నారు. అనంతరం రచయితలు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కామరాజు కాళీదాసు తదితరులు దేవులపల్లి కృష్ణశాస్త్రి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హాకీ పోటీలకు చింతాయపాలెం పాఠశాల విద్యార్థుల ఎంపిక

కర్లపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే 68వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు తోట వెంకటరాజులు తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి హాకీల పోటీలకు 14 సంవత్సరాల విభాగంలో బాలురు తోట వెంకట నవీన్, జె.రాజేష్, (8వ తరగతి), జె.రాతీష్‌రాజు (8వ తరగతి), 14 సంవత్సరాల బాలికల విభాగంలో ఎ.అక్షిత (7వ తరగతి), ఎస్‌కె.ఆయూష, 17 సంవత్సరాల బాలికల విభాగంలో కె.పావని (9వ తరగతి), ఎ.సాయిలక్ష్మి (9వ తరగతి) పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.గోపి తెలిపారు.

సూర్యలంకలో పారిశుధ్య పనులు

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా సూర్యలంక సముద్ర తీరంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. తీరం వెంట వ్యర్థాలు తొలిగించి శుభ్రం చేయించారు. కార్తీక మాసంలో ప్రతిరోజు తీరప్రాంతంలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సి.హెచ్.కరుణ, డి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరులో పశు వైద్య శిబిరం

వేమూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వేమూరులో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు శిబిరాన్ని ప్రారంభించారు. గేదేలకు గర్భకోశ వ్యాధుల పరీక్ష జరిపారు. దూడలు, కోళ్ల పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారా స్టాఫ్ చదలవాడ సాయిరాం పెనుమర్రు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

కొల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా నిరోధానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని పెసర్లంక అరవింద వారధి వద్ద విచ్చలవిడిగా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా అడ్డుకునేందుకు శుక్రవారం తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు ఎక్స్‌కవేటర్ సాయంతో నదిలోకి వెళ్లే మార్గాలను తవ్వించారు. ఇసుక కావాల్సిన వారు ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించిన రీచ్‌ల వద్దనే తవ్వకాలు చేసుకుని తీసుకువెళ్లాలన్నారు. నదిలో ఎక్కడబడితే అక్కడ ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేసి రవాణాకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. అక్రమ రవాణా నిరోధించేందుకు ఐదు కి.మీ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటుతో పాటు నదీ తీర గ్రామాలలో కూడా నిఘా బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

చుండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి అందిన చెక్కును శుక్రవారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. మోదుకూరుకు చెందిన ఉయ్యూరు భ్రమరాంబ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమె వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి అందిన రూ.1.70 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీడీవో

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెదలంకలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌వి రమణ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, లబ్ధిదారులందరికి శుక్రవారం పింఛన్ అందించడం జరుగుతుందని, ఎవరైనా అందుబాటులో లేకపోతే ఉద్యోగులు శనివారం పింఛన్ అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఊహారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెంచిన పెన్షన్‌ను ఒకేసారిగా లబ్ధిదారులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని బాపట్ల మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ అన్నారు. శుక్రవారం బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం గ్రామంలో లబ్ధిదారులకు పంచాయతీ అధికారులతో కలిసి పెన్షన్ డబ్బులను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి మార్పు ప్రతాప్‌జీవన్, పంచాయతీ కార్యదర్శి జాన్సీ తదితరులు పాలొన్నారు.

ఇంటింటా బీజేపీ సభ్యత్వ నమోదు

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. యువమోర్చా అధ్యక్షుడు నాశం నరేష్ మాట్లాడుతూ పేదప్రజల కోసం 5 లక్షల వరకు వైద్యఖర్చులు భరించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, బొమ్మిశెట్టి ప్రసాద్, ఇమ్మడిశెట్టి రాము, సుజిత్, విజయ్, బాలాజి, మోహన్, వీర్రాజు, రామయ్య, సుభాష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సందర్బంగా నరకాసురవధ

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సువర్చలసమేత ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద శ్రీమారుతీ రమా బాలభక్త సమాజం ఆధ్వర్యంలో నరకాసురవధ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాక్షసరాజు నరకాసుర బొమ్మను దహనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వినుకొండ సత్యంబాబు, శ్రీనివాసుల విఖనసమూర్తి, రామకృష్ణ, బార్గవ, దేశిరాజు రమణబాబు, కొలను మోహన్, దర్శి ప్రశాంత్, గాదంశెట్టి శివశేఖర్, అబ్బరాజు రమణ, ఆదూరి రామ్ తదితరులు పాల్గొన్నారు.

అంబటి లక్ష్మణరావుకు నివాళులు

చుండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి ఇటీవల మృతి చెందిన అంబటి లక్ష్మణరావుకు శుక్రవారం ఆలపాడులో గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. అంబటి లక్ష్మణరావు భార్య, కుటుంబీకులది ఆలపాడు కావడంతో ఈ గ్రామంలో అంబటి కుటుంబానికి విడదీయరాని సంబంధాలు ఉన్నాయి. గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో తన్నీరు శివశంకర్, చేబ్రోలు బోడియ్య, చాపల శివయ్య, సీతారామయ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, కమిషనర్ రఘునాథరెడ్డి

పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరద ప్రభావిత ప్రాంతాలలో బాపట్ల మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అందించిన సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. విజయవాడ ప్రాంతంలో సేవలందించిన 92 మంది కార్మికులకు ఆర్థికసాయం అందించటమేకాకుండా అక్కడ ప్రమాదంలో గాయపడిన ఒక కార్మికునికి రూ.25 వేల సాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్మికులు అందించిన సేవలు చూసి చలించిపోయానని, అందుకే తనవంతు సాయం అందిస్తున్నానని చెప్పారు. విపత్కర పరిస్థితులలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు ఆధ్వర్యంలో రన్‌ఫర్ యూనిటీ

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్దార్‌వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా బాపట్లజిల్లా పోలీసు శాఖా ఆధ్వర్యంలో రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల పట్టణ పోలీసుస్టేషన్ దగ్గర నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ జెండా ఊపి ప్రారంభించారు. పోలీసుసిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన పటేల్ జీవితం మనకు ఆదర్శప్రాయమన్నారు. రెండు కిలోమీటర్లు వరకు జరిగిన జాతీయ సమైక్యత పరుగులో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనేయులు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, పట్టణ సీఐ ఆర్ అహ్మద్‌జానీ, సర్కిల్ సీఐ హరికృష్ణ, ఆర్‌ఐలు మౌలుద్దీన్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, సిబ్బంది

పొట్టి శ్రీరాములు ఆశయాలను యువత అందిపుచ్చుకోవాలి


పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రేపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రరాష్ట్రం కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టి త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని బీజేపీ సీనియర్ నాయకుడు పిన్ని సాంబశివరావు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పాతపట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అన్నం సాయిబాబు, మాణిక్యారావు,వరప్రసాద్, నాగలీల, శివరామప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణలో బాపట్లది అద్వితీయమైన పాత్ర అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. పట్టణంలోని టౌన్‌హాలులో తెలుగుతల్లి విగ్రహం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి సమైక్యత రాగాన్ని బాపట్ల ఆలపించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం వాసవి క్లబ్, అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొలిశెట్టి రాంబాబు, తూనుగుంట్ల సుబ్బారావు, లలితబాబు, బొమ్మిశెట్టి కిరణ్‌కుమార్, తడికమల్ల విజయకుమార్, కూసం కృష్ణమూర్తి, తాడికొండ సూర్యనారాయణ, కొమ్మూరి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఏషియన్ డాడ్జ్‌బాల్ పోటీలకు శ్రీరామా విద్యార్థి ఎంపిక


హేమ్‌ప్రకాష్‌తో కోచ్ మహ్మద్ ఆలీ

కొల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్ ఏషియన్ డాడ్జ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కొల్లూరు మండల పరిధిలోని శ్రీరామా రూరల్ విద్యా సంస్థ నుంచి తమ విద్యార్థి ఎంపికైనట్లు డైరెక్టర్ కొలసాని తులసీవిష్ణు ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 2, 3 తేదీల్లో మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరగబోయే చాంపియన్‌షిప్ పోటీలకు జాతీయ జట్టుకు ఏపీ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా వారిలో అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన విద్యార్థి పైలా హేమ్‌ప్రకాష్ బాపట్ల జిల్లా చిలుమూరులోని శ్రీరామా రూరల్ విద్యా సంస్థ నుంచి ఎంపికయ్యాడు. ఎంపికైన క్రీడాకారునితో పాటు కోచ్ మహ్మద్ ఆలీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డాడ్జ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, శ్రీరామా డైరెక్టర్ తులసీవిష్ణు ప్రసాద్ అభినందించారు.

కూటమి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలి : సీపీఐ

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమితి ముఖ్యనాయకుల సమావేశం జరిగింది సమావేశానికి నియోజకవర్గ కార్యదర్శి బక్కా వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా జల్లి విల్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నివాసానికి ఇచ్చిన సెంటు స్థలం ఏమాత్రం సరిపోదని కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంతాలలో రెండుసెంట్లు, గ్రామీణప్రాంతాలలో 3సెంట్లు చొప్పున స్థలాలిచ్చి ఇంటినిర్మానానికి 5లక్షలు కేటాయించాలన్నారు. దీనిపై ఈనెల 18వ తేది నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్జీలు, ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జిల్లా కౌన్సిల్ సభ్యులు బత్తుల శామ్యూల్, జేబీ శ్రీధర్, తుమ్మల పూర్ణచంద్రశేఖర్, దొంతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కోలా వీరాంజనేయులు, గెల్లి వెంకటఅప్పయ్య, అక్కల నాగమణి, ఎం.వెంకట్రావు, ఏటగిరి శ్రీనివాసులు, మేకల రమణయ్య, పొట్లూరి అంకమ్మరావు, వీర్లంకమ్మ, యానాదమ్మ, ఎం.సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని చేనేత కార్మిక సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ పిలుపునిచ్చారు. శుక్రవారం భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద 105 వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఐటీయూసీ పతాకాన్ని నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆవిష్కరించారు. బాలాజీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగ, కార్మిక వర్గాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, రమేష్, వంగర శ్రీనివాసరావు, అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.


డివైడర్ ఢీకొన్న ద్విచక్రవాహనం : ముగ్గురికి గాయాలు

బాపట్లరూరల్, 'నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డివైడర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన శుక్రవారం బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ద్విచక్రవాహనంపై ముగ్గురు వ్యక్తులు సూర్యలంక తీరంకు వెళుతుండగా మార్గమధ్యంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో ఓ వ్యక్తి కాలికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

- శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభం
- వేడుకలకు ముస్తాబవుతోన్న ఆలయాలు
- కోటప్పకొండలో కార్తీక మాస పథకానికి విశేష స్పందన
- కాకానిలో నిత్య హోమాలు, రుద్రాభిషేకానికి ప్రత్యేక ఏరాట్లు
- అమరావతిలో కృష్ణమ్మకు హారతులు, తెప్పోత్సవం
- ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పల్నాడుజిల్లా నరసరావుపేట సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధి, పంచారామాలలో ప్రథమ ఆరామంగా, దక్షిణకాశీ పుణ్యతీర్ధంగా భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం, గుంటూరు జిల్లా, పెదకాకాని మండల కేంద్రంలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానాల్లో శనివారం నుంచి కార్తీకమాస పూజలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలు కార్తీకమాస వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. అధికారులు, నిర్వాహకులు ఆలయానికి తరలి వచ్చే భక్తుల కోసం ఆయా ప్రాంతాల్లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. త్రికోటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసంలో స్వామివారికి అభిషేకం చేయటం వలన సర్వదోష నివారణ, సర్వ కార్యసిద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం. అలాగే కాకాని మల్లేశ్వరుడు కోరిన వరాలు ఇచ్చే దేవుడుగా, అభిషేక ప్రియుడిగా నిత్య పూజలు అందుకోనున్నారు.





కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్

మహిమాన్విత క్షేత్రం అమరేశ్వరాలయం

పంచారామాలలో ప్రథమ ఆరామంగాను దక్షిణకాశీ పుణ్యతీర్ధంగాను భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని సందర్శించే భక్తులకు స్వామివారి దర్శనం సౌకర్యవంతంగా జరిగేలా ప్రత్యేక క్యూలైన్‌లు, మంచినీరు, ప్రసాదాలు పంపిణీ చేయడం జరుగుతుందని దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి పి. సునీల్‌కుమార్ తెలిపారు. ప్రత్యేకంగా పంచారామాలు దర్శించి భక్తులకు సకాలంలో స్వామివార్ల దర్శనం జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు. స్వామివారిని దర్శించుకోలేని భక్తులకు కార్తీకమాసం నెలరోజులు వారి గోత్ర నామాలతో పరోక్షంగా అభిషేకాలు చేసేందుకు రూ1,116 కార్యక్రమం ఉన్నట్లు తెలిపారు. కార్తీకపౌర్ణమి రోజున పవిత్ర కృష్ణమ్మకు హారతులు, స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పంచారామక్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు గుంటూరు రీజినల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు.





అమరేశ్వరాలయంలోని ప్రధాన మూడవ ప్రాకారం

నరసరావుపేట, పెదకాకాని, అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) కోటప్పకొండత్రికోటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక మాసంలో త్రికోటేశ్వర స్వామికి విశేష అభిషేకాలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తీక మాసం అభిషేక పథకానికి భక్తుల నుంచి మంచి స్పందన లభించింది. నాలుగు వేల మందికి పైగా భక్తులు కార్తీక మాసం అభిషేక పథకంలో సభ్యులుగా చేరారు. ఉదయం 5:30 గంటల నుంచి ఆలయం లో అభిషేకాలు ప్రారంభ మవుతాయి. భక్తులు పరోక్షంగా స్వామి అభిషేకపథకం లో పాల్గొనేందుకు రూ 1,000 టిక్కెట్ చెల్లించాల్సి ఉంది. ఈ పథకంలో చేరితే ప్రతి రోజు స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ పథకంలో చేరిన సభ్యులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేస్తారు. కార్తీక మాసం అనంతరం స్వామి ప్రసాదం, శేష వస్త్రం కొరియర్ ద్వారా సభ్యులకు అందజేస్తారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ 100 స్పెషల్ దర్శనంగా ఏర్పాటు చేశారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసాదం అందజేస్తారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకం అమలు జరుగుతున్నది. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 3 గంటల వరకు అన్నపూర్ణ సత్రంలో అన్నదానం చేస్తారు. కార్తీక మాసంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా ఆయా పనులను ఈవో డీ చంద్ర శేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలో ఉన్న పర్యాటక కేంద్రాన్ని సందర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆది, సోమవారం, పౌర్ణమి, ఏకాదశి రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తూ దేవస్థానం ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయను న్నది. నరస రావుపేట, చిలక లూరిపేట డిపోల నుంచి ఆర్టీసి బస్సులను కొండకు నిర్వహించను న్నారు. పోలీసు శాఖ భద్రతా చర్యలు చేపట్టింది.




అమరేశ్వరాలయంలోని ప్రణవేశ్వరుడు

మల్లేశ్వర స్వామికి నిత్య హోమాలు..

పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ అధికారి, ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కార్తీక మాస శుద్ధ పాడ్యమి నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు ఆలయంలో ఉదయం 8:30 గంటలకు మహన్యాస పూర్వక రుద్ర జప, రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించనున్నారు. రూ. 2000 పరోక్ష అభిషేక పథకాన్ని అధికారుల ప్రవేశపెట్టారు. చెల్లించిన వారికి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవంబరు 26న భక్తులచే సామూహిక లక్ష బిల్వార్చన, 29న మాస శివరాత్రి రోజు పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, డిసెంబరు 1న కార్తీక అమావాస్య ఆదివారం రాహు, కేతు పూజలు విశేషంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు.





పెదకాకాని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం



ఎండీయూ వాహనంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

రేషన్ బియ్యం పక్కదారి

- తహసీల్దార్ రాకతో ఎండీయూ ఆపరేటర్ పరార్
- 450కేజీలు (తొమ్మిది బస్తాలు) వ్యత్యాసం
- విచారణ అనంతరం చర్యలు చేపడతామన్న తహసీల్దార్
- పేదల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తెనాలి రూరల్, నవంబరు 01(ఆంధ్రజ్యోతి): పేదలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించేందుకు వచ్చిన తహసీల్దార్ రాకను గమనించి ఎండీయూ (రేషన్ పంపిణీ వాహనం) ఆపరేటర్ స్టాక్‌ను విడిచి పరారయిన సంఘటన తెనాలిలో చోటుచేసుకుంది. శుక్రవారం నుండి కార్డు దారులకు రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు లబ్ధిదారులకు చేరువచేసే విధానాన్ని మండల తహసీల్దార్ గోపాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంపిణీ ప్రారంభమైన గంట వ్యవధిలోనే చినరావూరు 08నెంబరు ఎండీయూ వాహనంలో సుమారు 9 బస్తాల్లో కేజీలు 450 బియ్యాన్ని అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ఆపరేటర్‌ను ప్రశ్నించేందుకు ప్రయత్నించగా అప్పటికే వాహనాన్ని విడిచిపెట్టి ఆపరేటర్ వెళ్లిపోయాడు. అనంతరం అదే ప్రాంతంలో రేషన్ డీలర్ పాయింట్‌ను సందర్శించి స్టాక్ వ్యత్యాసంపై వివరణ ఇవ్వాలని తహసీల్దార్ ఆదేశించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ పేదలు ఆకలితో ఉండకూడదన్న సదుద్దేశంతో ప్రభుత్వం కేజీ రూ.46 బియ్యాన్ని కొనుగోలు చేసి రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు అందిస్తుందని చెప్పారు. అయితే కొందరు దళారులు ఆ బియ్యంపై లేని పోని అపోహలు కల్పించి లబ్ధిదారులు వాటిని వాడకుండా కేజీ రూ.8 నుండి 12 వరకూ కార్డు దారులకు చెల్లించి కొనుగోలు చేస్తూ నల్లబజార్లకు తరలిస్తున్నారని చెప్పారు. దీని ద్వారా కార్డుదారుడు తీవ్రంగా నష్టపోతున్నారని గుర్తించాలన్నారు.ప్రభుత్వం పేదలు సద్వినియోగం చేసుకునేలా ఆహార భద్రతా నియమాలను పాటిస్తూ నాణ్యమైన బియ్యాన్ని ఇస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొందరు ఎండీయూ ఆపరేటర్లు ప్రభుత్వ ఆశయాన్ని నీరు గార్చేలా వ్యవహరిస్తున్నారని నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. స్టాక్ వ్యత్యాసం గుర్తించిన ఎండీయూ ఆపరేటర్‌పై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిచినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. రేషన్ పంపిణీపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని నిర్ణిత సమయం లోపు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. సీఎస్‌డీటీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

కార్తీకానికి సూర్యలంక సిద్ధం

- భక్తుల తాకిడికి తగ్గట్లు ఏర్పాట్లలో విఫలం
- తాత్కాలిక వసతులతో సరిపెట్టనున్న అధికారులు



తీరంలో దాతల సహకారంతో నిర్మించిన పోలీసు వాచ్‌టవర్



సూర్యలంక తీరంలోని చాలిచాలని స్నానాల గదులు

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పడి లేచే సముద్రకెరటాలు.. ఇసుక తిన్నెలు.. తెరచాప పడవలు, కన్యాకుమారిని తలపించేలా సూర్యోదయంతో, బాపట్ల సూర్యలంక తీరప్రాంతం. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తూ ఆంధ్ర గోవాగా ప్రసిద్ధి చెందింది. కార్తీకమాసంలో ఇక్కడకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇంతటి ప్రసిద్ధిగాంచిన సూర్యలంక తీరంలో మాత్రం భక్తులకు, పర్యాటకులకు కావాల్సిన వసతులు కల్పించలేకపోయారు. కేవలం వ్యాపార సముదాయాలు పెంచుకోవటమే కాని భక్తుల అవసరాలను మాత్రం గుర్తించి తగిన వసతులు కల్పించటంలో పాలకులు విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉందనే అంచనాలతో, ఇప్పటికే సమీక్షలు జరిపారు. భక్తులకు కావాల్సిన తాత్కాలిక వసతులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఏటా తాత్కాలిక వసతులు మినహా, శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కానరావడం లేదు. వైసీపీ పాలనలో అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే. రోజా రెండు సార్లు ఇక్కడకు వచ్చి పరిశీలించి అభివృద్ధి చేస్తామంటూ ఇచ్చిన హామీలు కాస్తా నీటి మూటలాగనే మిగిలిపోయాయి. సముద్రంలో జరుగుతున్న ప్రమాదాలను పసిగట్టేందుకు పోలీసు అధికారులు మాత్రం దాతల సహకారంతో మూడు వాచ్‌టవర్‌లు నిర్మించారు. మంతెన దశరథమహరాజు దాతల సహకారంతో తీరంలో శివాలయం నిర్మించారు. ఈరెండు మినహా ఇక్కడ జరిగిన అభివృద్ధి శూన్యమని చెప్పవచ్చు. గతంలో మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని శేషగిరిరావు పర్యాటకులు, భక్తుల కోసం దుస్తులు మార్చుకునేందుకు రెండు భవనాలను నిర్మించారు. వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధి పేరిట వాటిని తొలిగించి ఎలాంటి వసతులు కల్పించలేకపోయారు.

ప్రభుత్వం నుంచి నిధులు నిల్..

లక్షలాది మంది భక్తులొచ్చే ఈప్రాంతంలో కేవలం నాలుగు స్నానాలు గదులు మాత్రమే ఉన్నాయి. వీటిని కూడా వేలంపాట పెట్టి పంచాయతీవారు ఆదాయం సమకూర్చుకుంటూ మెరుగైన వసతులు కల్పించలేకపోతున్నారు. తీరానికి వచ్చే వాహనాల పార్కింగ్, స్నానాల గదుల ఆశీలు వసూళ్లకు పంచాయతీ వేలం ద్వారా, 36.06 లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. తీరంలో ఉన్న 38షాపుల ద్వారా 11.40 లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది. అయితే గజ ఈతగాళ్ళు, పారిశుధ్య కార్మికులకు ఈ ఆదాయం నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు. పారిశుధ్య సామగ్రి, విద్యుత్తు, ఇతర అవసరాలకు కూడా ఈడబ్బులే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వంనుంచి ఎటువంటి అదనపు నిధులు రావటంలేదని అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల పంచాయతీ ద్వారా వచ్చే ఆదాయం కాస్తా ఇతర అవసరాలకు వినియోగించాల్సి రావడంతో, భక్తులకు వసతులు కల్పించటంలో విఫలమవుతున్నారు.



సూర్యలంక తీరంలో దాతలు నిర్మించిన శివాలయం.



తీరంలో తొలిగించిన పర్యాటకులు దుస్తులు మార్చుకునే భవనాలు.

నేడు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సమావేశం

తుళ్లూరు, నవంబరు 1: (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం శనివారం మండల కేంద్రం తుళ్లూరులోని హెచ్‌ఎస్ఆర్ కళ్యాణ మండపంలో సమావేశం కానుంది. పర్యావరణం, సామాజిక వ్యవస్థల మదింపు ముసాయిదాపై స్థానిక ప్రజానీకంతో సంప్రందింపులు చేసే కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని సీఆర్డీఏ అధికారులు శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని అమరావతి నగర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈసమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని తల్లిదండ్రుల ముందే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చినరావూరులో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు చినరావూరుకు చెందిన గౌస్ ఖాజా మద్యానికి బానిస అయ్యాడు. తరచూ మద్యం సేవించి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తుంటాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో మద్యం తాగడానికి డబ్బు కావాలంటూ తల్లిదండ్రులను వేధించసాగాడు. ఎంతకు తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వకపోవడంతో వారిని బెదిరించడానికి ఆత్మహత్య చేసుకుంటానంటూ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొద్దిసేపటికి తల్లిదండ్రులు తలుపులు పగలగొట్టి చూడగా ఖాజా అప్పటికే చీరతో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

రెస్టారెంట్‌పై రౌడీషీటర్ దాడి

- ఎమ్మెల్యేతో మాట్లాడండి.. లేకుంటే వ్యాపారం జరగదు
- బార్ నిర్వాహకులను హెచ్చరించిన దుండగులు
- తనకు ఏ సంబంధం లేదన్న ఎమ్మెల్యే అరవిందబాబు
- పోలీసులకు ఫిర్యాదు.. ఎట్టకేలకు అరెస్టు

నరసరావుపేట లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్, టీడీపీ అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు గురువారం రాత్రి తన అనుచరులతో వినుకొండ రోడ్డులోని బార్‌వన్ రెస్టారెంట్‌పై దాడిచేసి భయోత్పాత వాతావరణం సృష్టించారు. భయపడిన బార్ నిర్వాహకులు రెండవ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కూడా ఈ రౌడీ మూక అరచాకాన్ని వీక్షించారేకాని ఏవిధమైన చర్యలు తీసుకోలేక పోయారు. దాడి చేస్తున్న సమయంలో నిర్వాహకులను ఎమ్మెల్యేతో మాట్లాడమని, లేని పక్షంలో వ్యాపారం నిర్వహించుకోలేరని తనకు తానే ఎమ్మెల్యేకి సంబంధం లేకపోయినా ప్రగల్భాలు పలుకుతూ దాడి చేశారు. నిర్వాహకులు పోకా శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాము బార్ లైసెన్స్‌ల కోసం రూ 2.90 కోట్లు వెచ్చించి 145 దరఖాస్తులు చేసి ఐదుషాపులు దక్కించుకున్నామన్నారు. అయినప్పటికీ అధికారపక్ష నాయకులు వేధింపులు భరించలేక ఒప్పందంలో భాగంగా ఒక షాపును ఇచ్చేశామన్నారు. ఐనా కూడా వ్యాపారంలో ఓ స్థాయిలో ఉన్న తమ పట్ల టీడీపీకి చెందిన వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇక పట్టణంలోని సామాన్య వర్తకుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో తలచుకుంటేనే భయం వేస్తుందన్నారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దృష్టికి తీసువెళ్ళారు. ఆయన సూచనల మేరకు రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రధాన నిందితుడు రౌడీషీటర్ చల్లా సుబ్బారావును అరెస్ట్ చేసినట్లు రెండవ పట్టణ సీఐ హైమారావు తెలిపారు. మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. కాగా ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ఈ ఘటనతో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. చట్టాన్ని ఉల్లఘించి ప్రవర్తించే వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

YouTuber

వినోదం.. సందేశం అన్నీ.. అర నిమిషంలోనే !

వేడి వేడి అన్నంలో టమాటా పప్పు.. రోటి పచ్చడి.. నెయ్యి వేసుకొని తింటే ఎంత సంతృప్తి కలుగుతుందో మల్లాది దుర్గా మల్లేష్ షార్ట్ వీడియోలు చూస్తే అదే అనుభూతి కలుగుతుంది. అందులో అశ్లీలత ఉండదు. ప్రమోషన్‌లు అసలే ఉండవు. కుటుంబమంతా కూర్చుని సినిమా చూసినట్లుగా చక్కగా చూడవచ్చు. కేవలం రెండేళ్లలో సుమారు 7 లక్షల మంది సబ్ స్క్రైబర్ లు. 22 కోట్ల వీక్షణలు. లక్షల్లో ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్ ఫాలోయర్స్. ఇదీ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన యూట్యూబర్ మల్లాది దుర్గా మల్లేష్ ప్రస్థానం..

గుంటూరు సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరి కి చెందిన మల్లాది దుర్గా మల్లేష్ అంటే కొత్తగా యూట్యూబ్ లో అడుగుపెట్టే వారికి ఒక ఐకాన్. నేటి స్మార్ట్ ఫోన్.. యూట్యూబ్ ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్న మల్లేష్ ప్రస్థానం గురించి తన మాటల్లోనే..



దుర్గా మల్లేష్

నేను పెద్దగా చదువుకోలేదు. కానీ కథలు రాయటం అంటే ఎనలేని ఆసక్తి.2010 నుండి కథలు రాస్తూనే ఉన్నా. వాటిని మా స్నేహితులతో కలిసి షార్ట్ ఫిల్మ్ లా తీసేవాళ్ళం. కానీ అవి చాలా మంది కి చేరేవి కావు.యూట్యూబ్ వచ్చాక కొన్ని వీడియోలు చూస్తుంటే వ్యూస్ కోసం అశ్లీలత, బూతులు ఇలాంటి వాటిని చూసి ఫ్యామిలీ సందేశంతో చేస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచన వచ్చింది.ఫ్యామిలీ కి సంబందించినవి చేస్తే ఎవరు చూస్తారని చాలా మంది నిరుత్సాహ పరిచారు.కానీ నేను అటువంటి మార్గం లోనే వెళ్లాలని నిర్ణయించుకున్నా. 2022 జూన్‌లో మల్లాది దుర్గా మల్లేష్ అనే పేరు తో యూట్యూబ్ ఛానల్ మొదలు పెట్టా. నా వీడియోలన్నీ కుటుంబ విలువలు బోధించేవే. ఒక తండ్రి పిల్లలతో ఎలా ఉండాలి.. పిల్లలు తండ్రి తో ఎలా ఉండాలి.. అలాగే భర్త భార్య తో..భార్య భర్త తో ఎలా ఉండాలి అనే విషయాల చుట్టూ తిరుగుతూ ఉంటాయి.నా భార్య, పిల్లలు అందరూ నా వీడియో ల్లో హీరోలు, హీరోయిన్‌లు.

ప్రారంభంలో అనుభవాలు ..

వీడికేమి పోయే కాలం.. సంప్రదాయబద్ధమైన కుటుంబ లో పుట్టి ఇవేం పాడుపనులు..హవ్వ.. వేదం నేర్చిన నోట.. ఈ మాటలు ఏమిటీ.. ఈ యాక్షన్ లు ఏమిటీ... మొదట్లో ఇలా ఎవరి నోటికి వచ్చినట్లు వాళ్ళు మాట్లాడారు.యూట్యూబ్ వీడియోలు చేస్తున్నానని ఊరి వాళ్ళ గోల తట్టుకోలేక మా నాన్న కూడా మాట్లాడటం మానేశాడు.నాలుగు రోజులు నాతో అసలు మాట్లాడలేదు. ఆయన కు ఇష్టం లేని పని ఎందుకు చేయాలని నేను కూడా ఫోన్ పక్కన పడేశా. అప్పటికే దుర్గమ్మ తల్లి మహత్యం మీద చేసిన వీడియో బాగా వైరల్ అయ్యింది. ఆ వీడియోని రెండు కోట్ల మంది చూశారు. మా నాన్న స్నేహితులు చాలా మంది దాన్ని వాట్స్ యాప్ స్టేటస్ గా పెట్టుకున్నారు. భోజనం చేస్తూ దాన్ని చూసిన నాన్న నా దగ్గరకు వచ్చి శభాష్ రా..అన్నాడు.నాకు అర్థం కాలేదు. ఆ తర్వాత అదే వీడియో ఆయన స్టేటస్ లో పెట్టుకున్నారు. సక్సెస్ వచ్చిన తరువాత మొదట్లో తప్పు గా మాట్లాడిన వాళ్ళంతా నోటి మీద వేలేసుకున్నారు.



యూట్యూబ్ మేకింగ్ వీడియోలో మల్లేష్ కుటుంబం

ఒక వీడియోకి ఎంత సమయం పడుతుంది

మేము తీసే వీడియో నిడివి కేవలం అర నిముషం మాత్రమే. కానీ దాన్ని మంచి సందేశం తో తీయటానికి సుమారు నాలుగైదు గంటలు పడుతుంది. కానీ నేను వారానికి రెండు రోజులు మాత్రమే వీడియో లు చేస్తా. ప్రతి బుధవారం, ఆదివారం మాత్రమే. మిగిలిన రోజుల్లో వాటి జోలి అసలు పోము. మంగళగిరి పానకాల స్వామి గుడి వద్ద ఉన్న పూజా సామాగ్రి షాపును చూసుకుంటా.

యూట్యూబ్ వల్ల గుర్తింపు..

ఒకప్పుడు నాది చాలా చిన్న కుటుంబం.కానీ ఇప్పుడు నాది లక్షలాది మంది కలిగిన కుటుంబం. నన్ను అభిమానించే వాళ్ళు. నేను అభిమానించే వాళ్ళు.ఏ కష్టం వచ్చినా ఒకరికి ఒకరంఅంటూ స్పందిస్తూ ఉంటే .ఇదంతా కేవలం యూట్యూబ్ ప్లాట్ ఫారం వల్లే.ఎక్కడో ఉన్న వాళ్ళ ను ఒక కుటుంబం గా చేసింది. చాలా మందికి ఇబ్బందులు వచ్చాయి.నేను ఒక్కడినే కాదు. వాళ్ళ కోసం మా కుటుంబంలో చాలామంది స్పందించారు. మాకు చేతనైనంత చేశాను. మెదక్ జిల్లాకు చెందిన ఒక సబ్ స్క్రైబర్ రైతు.ట్రాక్టర్ మీద నుంచి కింద పడి చేయి విరిగింది. ఫోన్ చేశాడు. అందరం అంతో ఇంతో సహాయం చేశాం. కరోనా వచ్చి క్వారంటైన్ కి వెళ్లి వాళ్ళు మానసికంగా కుంగిపోకుండా ఉండేందుకు గంటకు ఒకరి చొప్పున వాళ్ళ కి ఫోన్ చేసి మాట్లాడే వాళ్ళం.

ప్రమోషన్ వీడియోలు చేస్తారా..

డబ్బు సంపాదన కు నేను వ్యతిరేకం.చాలా మంది వస్తారు ప్రమోషన్ వీడియో లు చేయమని. అలా చేస్తే నెలకు లక్షల్లో ఆదాయం వస్తుంది. నాకు అది ఇష్టం లేదు. నేను చేస్తున్న వీడియో లకు యూట్యూబ్ నుంచి ఎంతో కొంత వస్తుంది. అది చాలు నాకు.



పొంచి ఉన్న ప్రమాదం

పర్చూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : వందల మంది ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో హైటెన్షన్ విద్యుత్ వైర్లతో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం కూలటానికి సిద్ధంగా ఉంది. దీనికి తోడు వైర్లు సైతం కిందకు జారిపోయి ఉన్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో వైర్లు తగిలి తరచూ మంటలు చెలరేగుతున్నా పట్టించుకోవడంలేదు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్

నిరుపేదలకు కొండంత అండ

కలెక్టర్ వెంకట మురళి

కారంచేడు(పర్చూరు)నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పథకం నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తుందని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి అన్నారు. కారంచేడులోని అంబేడ్కర్ కాలనీలో నిర్వహిస్తున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేసి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురిఅయిన నిరుపేదలకు భరోసా కల్పించటం అభినందనీయం అన్నారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, కిడ్నీ వ్యాధి గ్రస్తులకు ప్రతినెలా ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందన్నారు. జిల్లాలో 2,29,635 మంది లబ్ధిదారులకు రూ.95.61 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈకార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, మండల ప్రత్యేక అధికారి స్యామ్సన్, తహసీల్దార్ జి.అనిత, ఎంపీడీవో గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.



కారంచేడు అంబేద్కర్ నగర్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకట మురళి

పెన్షన్ల పంపిణీని పరిశీలించిన ఎంపీడీవో

చినగంజాం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి పరిశీలించారు. చినగంజాం, కడవకుదురు, గొనసపూడి, పెదగంజాం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లో జరుగుతున్న పెన్షన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. మండల పరిధిలో 96 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి శనివారం అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

పింఛన్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలి

అద్దంకిటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పింఛన్ల పంపిణీ అన్ని గ్రామాలలో సక్రమంగా చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎల్. భీమయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం ఉందని, పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. శుక్రవారం నాటికి మండలంలో 98శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీవో బత్తిని సింగయ్య తెలిపారు.



శింగరకొండలో కదళీఫలార్చన

అద్దంకి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా శుక్రవారం10 వేల అరటిపండ్లతో దశ సహస్ర కదళీఫల పూజ నిర్వహించారు. దేవాలయంలో శుక్రవారం ఉదయం నిత్య పూజల అనంతరం వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా దశసహస్ర కదళీఫల పూజ నిర్వహించారు.ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు.

మహిళలకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

మార్టూరు,నవంబరు1(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో భాగంగా దీపం 2 పథకం కింద మహిళలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం తహసీల్దారు కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దారు టి. ప్రశాంతి చేతుల మీదుగా మహిళలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీకి సర్వర్ కష్టాలు

పింఛన్ల పంపిణీకి అవస్థ

పర్చూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : పెన్షన్‌ల ప్రక్రియను త్వరిత గతిన సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయటంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. శుక్రవారం ఉదయం 5గంటలకే పంపిణీ కార్యక్రమంలో పాల్గొన అధికారులకు సర్వర్ మొరాయించటంతో ప్రక్రియ అరకొరాగా సాగింది. తరుచూ సర్వర్ మొరాయింటంతో అధికారుల్లో ఒకింత ఆందోళన నెలకొంది. ఉదయం పంపిణీ కార్యక్రమం మందకొడిగా సాగినా మధ్యాహ్నం సర్వర్ పనిచేయటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పర్చూరు మండల పరిధిలో 96శాతం వరకు పెన్షన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ పర్యవేణలో సిబ్బంది పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఇబ్బందులు పడిన ఉద్యోగులు

బల్లికురవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఒకటో తేదీనే పింఛన్ల సొమ్ము వృద్ధుల చేతికి అందించాలని ఆదేశాలు ఇచ్చినా సర్వర్ డౌన్ సమస్య కొంప ముంచింది. దీపావళి పండగ సందర్భంగా 31వ తేదీన బ్యాంకులకు సెలవు ఉండటంతో పింఛన్ల సొమ్ముకు ఇబ్బంది లేకుండా 30వ తేదీన నగదు డ్రా చేసి సిబ్బందికి ప్రభుత్వం అందించింది. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు గ్రామాలకు చేరి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. కానీ ఉదయం 8 గంటల నుంచే సర్వర్ రాకపోవటంతో పింఛన్‌దారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు సర్వర్ పనిచేయలేదు. ఆ తర్వాత పనిచేయటంతో 85 శాతం మాత్రమే పింఛన్ల పంపిణీ జరిగింది.



ముక్తేశ్వరంలో సర్వర్ డౌన్‌తో పింఛన్ల కోసం సచివాలయం వద్ద ఎదురు చూస్తున్న వృద్ధులు

రేపటి నుంచి స్వాములకు అన్నదానం

ఇంకొల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు అయ్యప్ప సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి స్థానిక పోలేరమ్మ గుడిలో దీక్షధారణ చేసిన స్వాములకు 41 రోజుల పాటు అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కాగా,విజయనగరం జిల్లా కుంటినవలస గ్రామానికి చెంది న ఇద్దరు అయ్యప్పలు లావేటి శివ, యామన సింహాచలంలు శబరిమలకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ఇంకొల్లుకు చేరింది.

పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

బల్లికురవ. నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం బల్లికురవలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ బలోపేతానికి విశేష కృషి చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, సర్వీసు ఉపాధ్యాయులైన లేమాటి భావన్నారాయణ, జంధ్రానుపల్లి మోషే, చంటి పుల్లారెడ్డి, చెన్నారెడ్డి, గరిమిడి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. అనంతరం మండల శాఖ సమావేశం జరిగింది. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా వేణుబాబు, ప్రధాన కార్యదర్శిగా భాస్కరరావు, గౌరవాధ్యక్షులుగా సాంబశివారెడ్డి, ఉపాధ్యక్షులుగా ముంతాజ్, శ్రీనివాసరావులను ఎన్నుకొన్నారు. అదేవిధంగా జిల్లా కౌన్సిలర్లుగా దూళిపాళ్ల శేషగిరి, చంటి శ్రీనివాసరెడ్డి, గాలం వీరాంజనేయులు, అవుల పెద్దబ్బాయిలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ స్వర్ణోత్సవాలలో సీనియర్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మండల శాఖ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిధులు మంజూరు కాగానే ఎత్తిపోతల పనులు

బల్లికురవ. నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు గ్రామాలలో ఉన్న ఎత్తిపోతల పథకాలు అలంకార ప్రాయం అని గత నెల 30 వ తేదీన వచ్చిన కథనానికి చీరాల ఐడీసీ కార్యనిర్వాహక ఇంజనీరు హజరత్తయ్య స్పందించారు. ఈ మేరకు శుక్రవారం అయన ప్రకటన విడుదల చేశారు. ఉప్పుమాగులూరు ఎత్తిపోతల పథకం పైపులైన్ మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, రూ. 4 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని, అవి మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. అలానే నక్కబొక్కలపాడు ఎత్తిపోతల పథకానికి 400 కేవీవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం అని నివేదిక పంపామన్నారు. అలానే గుంటుపల్లి ఎత్తిపోతల పథకానికి విద్యుత్ లైన్ మరమ్మతులకు గురైందని, ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేశామని ఆయన తెలిపారు.

వీధి లైట్ల నిర్వహణ అస్తవ్యస్తం

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కొత్త స్తంభాలు, లైన్లు ఏర్పాటు

వీధిలైట్లు ఏర్పాటు, నిర్వహణలో మున్సిపాలిటీ విఫలం

అద్దంకి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ లైట్ల నిర్వహణ, కొత్తవి ఏర్పాటులో అధికారులు విఫలమయ్యారని, పలు ప్రాంతాలలో చీకట్లో ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని ఆయా ప్రాంతాల ప్రజల తో పాటు ప్రజా ప్రతినిధులు విమర్శిస్తున్నారు. అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలో పలు కాలనీలలో కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు అవసరమైన అన్ని చోట్ల కొత్తగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు జరిగింది. అయితే అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయటం అలా ఉంచితే మరమ్మతులకు గురైన వాటిపై పూర్తి నిర్లక్ష్యం కొనసాగుతుంది. ఈ విషయాన్నే ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్‌లు మూకుమ్మడిగా ప్రశ్నించారు. రాత్రి సమయాలలో ఆయా కాలనీలలో ప్రజలు వీధుల వెంట నడిచి వెళ్లాలంటే చీకట్లో ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఇక పట్టణంలో ప్రధాన కూడలిగా ఉన్న భవానీ సెంటర్‌లో ఉన్న హైమాస్ట్ లైట్లు కూడా వారం రోజులుగా మరమ్మతులకు గురై వెలగటం లేదు. కూడలి ప్రాంతంలో వాహనచోదకలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వీధిలైట్ల మరమ్మతులు వెంటనే చేపట్టడంతో పాటు, అవసరమైన చోట్ల వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



భవానీసెంటర్‌లో వెలగని హైమాస్ట్ లైట్లు

అవినీతికి అండదండలు

మొన్న సస్పెన్షన్.. నేడు పోస్టింగ్..

అటు రాజకీయ ఇటు ఉద్యోగ సంఘ నేతల పైరవీలే కారణం అన్న విమర్శలు

రచ్చకెక్కుతున్న ఖజానా కార్యాలయ భాగోతం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అక్కడ అవినీతి వ్యవహారాలు జోరుగా సాగాయి. డబ్బులు ఇస్తేనే బిల్లులు ఓకే చేశారు. లేదంటే నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారు. కార్యాలయాన్ని తక్షణం ప్రక్షాళన చేయాల్సిందే.. ఇది విచారణాధికారి నివేదిక. తదనుగుణంగా స్పందించిన కలెక్టర్, ఉన్నతాధికారులు ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. మిగిలిన ఉద్యోగులు మొత్తాన్ని అక్కడి నుంచి బదిలీ చేశారు. అవినీతికి నిలయంగా మారిన ఉమ్మడి జిల్లాలోని ఖజానా కార్యాలయానికి సంబంధించి కథాకమామీషు ఇది. అయితే అంతలోనే ఖజానా కార్యాలయంలో కొందరు ఉద్యోగులు ఒక పక్క, ఉద్యోగ సంఘం నాయకులు మరోపక్క రంగంలోకి దిగారు. అవినీతి ఉద్యోగులను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. కుదరకపోవటంతో సదరు ఉద్యోగుల ద్వారా ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చారు. ఉన్నతాధికారులపై ఇటు ఉద్యోగ నాయకులు, అటు రాజకీయ నాయకుల ఒత్తిడి పెరగటంతో సస్పెండైన ఉద్యోగులకు తిరిగి పోస్టింగ్‌లు లభించాయి. తదనుగుణంగా చీరాలలో సస్పెండ్ అయిన ఖజానా కార్యాలయ ఉద్యోగి శుక్రవారం ఒంగోలులోని జిల్లా ఖజానా కార్యాలయంలో తిరిగి ఉద్యోగంలో చేరారు.

అవినీతి వ్యవహారాల రచ్చ

ఇటీవల చీరాల ట్రెజరీ కార్యాలయంలో ఉద్యోగుల అవినీతి వ్యవహారాలు తదనుగుణంగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోవటం తెలిసిందే. అదే సమయంలో చీరాల ఉపఖజానా కార్యాలయంలో అవినీతికి ఆస్కారం ఉన్న పోస్టింగ్‌ల్లో ఉద్యోగుల బాధ్యతల మార్పు రచ్చకెక్కింది. అప్పటి ఎస్‌టీవో భాగ్యలక్ష్మీ కార్యాలయంలోని ఉద్యోగుల బాధ్యతలను అకస్మాత్తుగా మార్చేశారు. దానిపై కొందరు ఉద్యోగులు చీరాల ఎమ్మెల్యే కొండయ్యయాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కొందరికి అన్యాయం జరిగింది, వెంటనే సరిచేయండి అంటూ ఎమ్మెల్యే కొండయ్య జిల్లా అధికారితో పాటు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఇదే సమయంలో చీరాల ఖజానా కార్యాలయంలో లంచం ఇవ్వందే బిల్లులు మంజూరు కావటం లేదంటూ కొందరు ఫిర్యాదులు చేశారు. దీంతో ఉన్నతాధికారులు దృష్టిసారించారు. బాపట్ల కలెక్టర్ ఆగమేఘాలపై దర్యాప్తునకు ఆదేశించారు. ఆర్డీవో ఒకటి రెండు రోజులు కార్యాలయంలో తిష్టవేసి విచారణ చేశారు. నెలల తరబడి బిల్లుల చెల్లింపులు నిలిచిపోవటం నిజమేనని తేల్చారు. అందుకు అవినీతి వ్యవహారాలే కారణంగా భావించారు. అలాగే ఉద్యోగుల మధ్య అంతర్గత పోరు నడుస్తున్నమాట నిజమేనని ఆ విచారణలో తేల్చిచెప్పారు. అదే సమయంలో విభేదించుకుంటున్న ఉద్యోగులు పోటాపోటీగా రచ్చకెక్కారు. విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకున్నారు. చీరాల ఎస్‌టీవో భాగ్యలక్ష్మీతోపాటు మరో ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఆ కార్యాలయంలోని మిగిలిన ఉద్యోగులందరినీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఇతర సబ్ ట్రెజరీలకు బదిలీ చేశారు.

ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు

సబ్ ట్రెజరీ ఉద్యోగులకు అండగా నిలిచే ఒక ఉద్యోగ సంఘం నాయకుడు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని రంగంలోకి దిగినట్లు తెలిసింది. అనుకున్న విధంగా పనులు జరగకపోవటంతో సస్పెండ్ అయిన ఉద్యోగులు బాపట్ల జిల్లాలోని కీలక ప్రజాప్రతినిధికి తెలిపారు తమ సొంతూరి టీడీపీ నాయకులను తీసుకొని ప్రజాప్రతినిధులను కలవటంతో ఆయన కిమ్మనకుండా వారికి మద్దతు తెలిపినట్లు తెలిసింది. సదరు ప్రజాప్రతినిధి వాళ్లకు పోస్టింగ్ ఇవ్వాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. అందుకనుగుణంగా ఉద్యోగ సంఘం నాయకులు రాష్ట్ర అధికారిపై వత్తిడి పెంచారు.విచారణ అధికారి ఇచ్చిన నివేదికను పక్కన పెట్టి సదరు ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చా రు. భాగ్యలక్ష్మీతో పాటు మరో ఉద్యోగిని ఒంగోలులోని జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపారు. ఉద్యోగ సంఘం నాయకుల ఆదేశాల మేరకే ముందుకు సాగే ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటనే వారికి వారు కోరిన చోట పోస్టింగ్‌లు ఇచ్చేశారు. ఈ వ్యవహారం ఉమ్మడి ప్రకాశం జిల్లాతోపాటు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

సోకిలేరు ఉధృతిలో కొట్టుకుపోయి యువకుడు మృతి

చింతూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద వాగు ఉధృతిలో కొట్టుకుపోయి అమినిగడ్డ సాయికృష్ణ(29) మృతిచెందాడు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి సోదరుడు రవీంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... ప్రకాశం జిల్లా కాకుటూరివారిపాలేనికి చెందిన సాయికృష్ణ, నాగసాయి, నాగార్జున, రవీంద్ర, వంశీ హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో వంశీ మినహా మిగిలిన నలుగురూ అన్నదమ్ముల పిల్లలు. వంశీ వీరందరికీ స్నేహితుడు. కాగా దీపావళి సందర్భంగా వచ్చిన సెలవుల నేపథ్యంలో వీరంతా పర్యాటక ప్రదేశాలను సందర్శించాలనుకున్నారు. ఈ క్రమంలో మూడు ద్విచక్ర వాహనాలపై హైదరాబాద్ నుంచి ఈ ఐదుగురు గురువారం బయల్దేరారు. శుక్రవారం ఉదయం భద్రాచలం చేరుకుని సీతారామచంద్ర స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. దీంతో ప్రయాణం వయా చింతూరు మండలం మీదుగా సాగింది. మార్గమధ్యంలో సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద ఆగారు. అప్పటికే పలువురు పర్యాటకులు సోకిలేరు వాగు నీటిలో స్నానం చేసున్నారు. అది చూసిన యువకులు కూడా వాగులో స్నానం చేయాలనుకున్నారు. ఈ క్రమంలో సాయికృష్ణ, నాగసాయి, నాగార్జున కూడా వాగులోకి దిగారు. నీటి ఉధృతికి సాయికృష్ణ కొట్టుకుపోయాడు. దీనిని గమనించిన అక్కడున్న పర్యాటకుల సహకారంతో సాయికృష్ణ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి మిగిలిన నలుగురూ సాయికృష్ణ మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి ఆటోలో తరలించారు. ఆసుపత్రి వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు.



సాయికృష్ణ మృతదేహం

యథేచ్ఛగా కొండభూమి కబ్జా

బోరు వేసి మొక్కలు నాటేందుకు గుంతలు తీసిన అక్రమార్కులు

అడ్డుకున్న చందలూరు గ్రామస్థులు

దర్శి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల ఆక్రమణకు అక్రమార్కులు తెగబడుతున్నారు. తమకు పట్టాలు ఉన్నాయని యథేచ్ఛగా బోర్లు వేసి మొక్కలు నాటే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా మండలంలోని చందలూరులో కొండభూమిలో 50 ఎకరాలను పాత గుంటూరు జిల్లాకు చెందిన కొంతమంది ఆక్రమించి చదునుచేశారు. చందలూరు రెవెన్యూలోని సర్వేనంబర్ 757లో సుమారు 1,050 ఎకరాల కొండభూమి ఉంది. అందులో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు పశువులు, గొర్రెల మేత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వం మొక్కలు కూడా నాటింది.

50 ఎకరాలు అన్యాక్రాంతం

గుంటూరు జిల్లాకు చెందిన ఒకరు కొండ భూమిలో 50 ఎకరాలు ఆక్రమించి దీర్ఘకాలిక పైర్లు వేసేందుకు గుంతలు తీశారు. నీటి అవసరాల కోసం బోరు వేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు గురువారం అక్కడకు వెళ్లి అడ్డుకున్నారు. భూమి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను ముందుకు సాగకుండా మహిళలు అడ్డుపడ్డారు. ఈ భూమిపై తనకు హక్కులు ఉన్నాయని, గతంలో తాను పట్టాలు తీసుకున్నానని ఆన్‌లైన్ కూడా తన పేరుమీద ఉందని ఆ అక్రమార్కుడు బుకాయించాడు. అయినప్పటికీ గ్రామస్థులు లెక్కపెట్టలేదు. కొండ భూమికి ఎవరు పట్టాలు ఇస్తారని, నకిలీవి సృష్టించి ప్రభుత్వ భూమి స్వాహా చేసే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్రమార్కుడు తాత్కాలికంగా పనులు నిలిపివేశాడు.



చందలూరు కొండభూమిలో వేసిన బోరు

గత ప్రభుత్వంలో నకి'లీల'లు

గత ప్రభుత్వ హయాంలో అనేక మంది అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించే ప్రయత్నంచేసిన విషయం విదితమే. ప్రస్తుతం కొండ భూమిని ఆక్రయించిన వ్యక్తి కూడా చెబుతున్న ప్రకారం ఆ పట్టాలు ఎవరు ఇచ్చారనే విషయం తేలాల్సి ఉంది. నిబంధనల ప్రకారం కొండభూమికి పట్టాలు ఇచ్చే వీలులేదు. ఈవిషయంపై దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. రికార్డులు పరిశీలించి పట్టాలు ఇచ్చారా లేదా అనే విషయాన్ని నిగ్గు తేల్చుతామన్నారు. ప్రభుత్వ భూములను పూర్తిగా పరిరక్షిస్తామన్నారు. ఆక్రమణకు ఎవరు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కొండభూమిలో మొక్కలు వేసేందుకు తవ్విన గుంతలు

అవీ..ఇవీ



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

మద్యం దుకాణం వద్దని ఆందోళన

వేటపాలెం(చీరాల), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మా ప్రాంతంలో మద్యం దుకాణం వద్దని పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. వేటపాలెం రావూరిరోడ్డులో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. మద్యం దుకాణంతో ఎదురయ్యే సమస్యలను వివరిస్తూ వారు నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు ఆ ప్రాంతానికి వెళ్లి ఆందోళనకు దిగినవారితో మాట్లాడారు. ఆర్డీవోకు, కలెక్టర్‌కు అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. తమకు రాతపూర్వకంగా తెలపాలని చెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు. శుక్రవారం అధికారులకు తమ ప్రాంతంలో మద్యం దుకాణం వద్దని అర్జీలు ఇచ్చినట్లు ఆ ప్రాంత మహిళలు తెలిపారు.



బల్లికురవ ప్రాంతంలోని గ్రానైట్ క్వారీ

4 నుంచి గ్రానైట్ క్వారీలలో భద్రత వారోత్సవాలు

బల్లికురవ. నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :గనులలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఏటా భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా బల్లికురవ మండల పరిధిలో ఉన్న గ్రానైట్ క్వారీలలో భద్రత వారోత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా చీమకుర్తి వద్ద ఉన్న వీటీసీ అధికారుల పర్యవేక్షణలో భద్రత వారోత్సవాల నిర్వహణకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. క్వారీలలో అనుభవం కలిగిన ఫస్టు క్లాస్ మేనేజర్లతో పలువురిని కమిటీ సభ్యులుగా నియమించి అన్ని గ్రానైట్ క్వారీలలో తనిఖీలు చేపట్టి భద్రత పరంగా ఎవరు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో నివేదికలను తయారు చేసి పటిష్ట చర్యలు చేపడుతున్నారు. వారోత్సవాలు నిర్వహించేందుకు గ్రానైట్ క్వారీలను ముస్తాబు చేస్తున్నారు.



అనమనమూరు గ్రామసభలో అధికారులకు అర్జీ ఇస్తున్న రైతు

రీసర్వేలో అందరికీ న్యాయం

మేదరమెట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో గ్రామాలలో సర్వేలో ఏర్పడిన సమస్యలను రీ సర్వేలో పరిష్కారిస్తామని రీ సర్వే డీటీ రవికాంత్ తెలిపారు. శుక్రవారం అనమనమూరులో జరిగిన రీ సర్వే గ్రామ సభకు సర్పంచ్ జంపు హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 120 మంది రైతులు అధికారులకు అర్జీలు ఇచ్చారు. సర్వే అంతా తప్పుల తడకగా ఉందని రైతులు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మహేష్‌బాబు, వీఆర్వో మారుతి సుబ్రహ్మణ్యం , గ్రామ సర్వేయర్‌లు, రైతులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

యద్దనపూడి పీహెచ్‌సీ పరిశీలన

యద్దనపూడి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఉదయం డీఎంహెచ్‌వో ఎస్. విజయమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని ఆమె పరిశీలించారు. పాత ప్రభుత్వ ఆస్పత్రి భవనంలోనే ఆస్పత్రి నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూసీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. తదుపరి మార్టూరు మండలంలో ఉన్న ద్రోణాదుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విజయమ్మ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి దివ్య లహరి, సూపర్ వైజరు ఆంజనేయులు, సీహెచ్‌వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చినకాశీగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరం

కార్తీక మాసంలో పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

అద్దంకి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అద్దంకి మండలంలోని మణికేశ్వరం చిన కాశీగా ఖ్యాతికెక్కింది. కాశీలో ఉన్న విధంగానే శివాలయం ముందే శ్మశానం ఉండటం, పక్కనే ఉన్న గుండ్లకమ్మ నది తూర్పు నుంచి పడమరకు ప్రవహించటం విశేషం. కార్తీక మాసంలో మణికేశ్వరంలోని శివాలయానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి మల్లేశ్వరస్వామిని దర్శించుకుంటారు. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో దేవాలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో గుంటుపల్లి వాసుబాబు, పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణలు తెలిపారు.



మణికేశ్వరంలోని శివాలయం

4 వ తేదీ మొదటి సోమవారం, 5 వ తేదీ నాగులచవితి, 9 వ తేదీ కోటి సోమవారం, 11 వ తేదీ 2 వ సోమవారం, 12 వ తేదీ చిలుక ఏకాదశి, 15 వ తేదీ కార్తీక పౌర్ణమి,16 వ తేదీ 3వ సోమవారం, 28 వ తేదీ 4 వసోమవారం,29 వ తేదీ మాస శివరాత్రి, డిసెంబరు2 వ తేది పోలి స్వర్గం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. కార్తీక మాసం ఏర్పాట్లను ఈవో వాసుబాబు, గ్రామ టీడీపీ నేతలు అంజయ్య, బలరామిరెడ్డి తదితరులు పరిశీలించారు.



మణికేశ్వరంలోని శివాలయం పక్కనే ప్రవహిస్తున్న గుండ్లకమ్మ నది (వ్యూ)

న్యూజిలాండ్‌కు ఏలూరి, వేగేశన

- టీడీపీ విజయోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు

పర్చూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్ర వర్మలు శుక్రవారం న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించిన నేపథ్యంలో అక్కడ తెలుగుదేశం పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించనున్నారు. అక్కడి అసోసియేషన్ ఆహ్వానం మేరకు ఇరువురు ఎమ్మెల్యేలు న్యూజిల్యాండ్ వెళ్లారు. ఈనెల మూడు, నాలుగో తేదీల్లో జరిగే వేడుకల్లో వారు పాల్గొననున్నారు. భారీ ఎత్తున వేడుకలను నిర్వహించేందుకు మన అంధ్ర తెలుగు అసోసియేషన్ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నది.



విమానాశ్రయంలో ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

ముగిసిన ఉమ్మడి జిల్లా బాలుర ఖోఖో జట్టు శిక్షణ

పంగులూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అండర్ -17 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టుకు శిక్షణ శుక్రవారంతో ముగిసింది. పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ఈ శిక్షణ జరిగింది. స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో కంచర్లవారిపల్లి ఉన్నత పాఠశాల పీడీ భవనం కాశీ విశ్వనాథరెడ్డి, రుద్రవరం ఉన్నత పాఠశాల పీడీ కె. హనుమంతరావులు శిక్షకులుగా వ్యవహరించారు. శిక్షణ పొందిన జిల్లా జట్టు ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా తుమ్మపాలులో జరిగే అండర్ -17 రాష్ట్రస్థాయి బాలుర ఖోఖో పోటీలలో పాల్గొంటారని రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు.

జట్టులో పాల్గొనే క్రీడాకారులు

ఈ నెల 2వ తేదీ నుంచి అనకాపల్లి జిల్లా తుమ్మపాలులో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే జిల్లా బాలుర జట్టులో పి.నవీన్, సయ్యద్ షానవాజ్, టి.మనోజ్, ఎం.అక్షయ్‌కుమార్, ఎం.ఆంజనేయులు (జడ్.పి.హెచ్.ఎస్. పంగులూరు), డి.వినయ్, ఎం.సాగర్‌నాయక్, పి.నరేష్,సి.హెచ్.నాగవర్ధన్ (ఎం.ఎస్.ఆర్. బి.ఎన్.ఎం. జూనియర్ కళాశాల, పంగులూరు), పి.అభిలాష్ (జడ్.పి.హెచ్.ఎస్. రుద్రవరం), ఎస్.రఘుపతి, ఎ.నవనీత్‌కుమార్ (జడ్.పి.హెచ్.ఎస్, కె.వి.పల్లి) పాల్గొంటారని సీతారామిరెడ్డి తెలిపారు. జట్టు మేనేజర్లుగా ఎస్.ఆర్.ఆర్. అకాడమీ సీనియర్ జాతీయ క్రీడాకారులు ఎన్.అజయ్, పి.శివగణేష్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.



శిక్షణ పూర్తి చేసుకున్న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు

ఎమ్మెల్యే ఏలూరి కృషితో రెండు అండర్‌పాస్‌ల మంజూరు

మార్టూరు, నవంబరు1(ఆంధ్రజ్యోతి):జాతీయరహదారిపై మార్టూరు మండల పరిధిలో రాజుపాలెం క్రాస్ రోడ్డు , జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద రెండు అండరుపాస్‌ల మంజూరుకు కృషి చేసిన పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావుకు మార్టూరు ప్రాంత ప్రజానీకం తరపున అభినందనలు తెలుపుతున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు ఒంగోలు నుంచి విజయవాడ వెళ్లే 16 వ నంబరు జాతీయరహదారి ఆరులైన్లుగా విస్తరించిన తర్వాత రాజుపాలెం, జొన్నతాళి క్రాస్ రోడ్ల వద్ద అండరుపాస్‌లు ఏర్పాటుచేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) రాజుపాలెం రోడ్డు వద్ద పెద్ద అండరుపాస్, జొన్నతాళి వద్ద మినీ అండరుపాస్‌ల నిర్మాణానికి రూ.66.58 కోట్లు మంజూరు చేశారని వారు తెలిపారు. టెండర్ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ రజాక్, తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్,పోలూరి సింగయ్య, కాకోలు వెంకటేశ్వర్లు,కన్నెగంటి శ్రీనివాసరావు, సకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు .



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

- కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని కలెక్టర్ జె. వెంకటమురళి, ఎమ్మెల్యే కొండయ్యలు చెప్పారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో శుక్రవారం ఉచిత సిలిండర్ల పంపిణీని వారు ప్రారంభించారు. లబ్ధిదారులకు సిలిండర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు గాను మొదట విడతగా రూ.15 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈపురుపాలెంలో ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉంటున్నాయని, అలాంటి వారిని గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికి నివేశన స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొండయ్య కలెక్టర్‌ను కోరారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.6.37 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రమణ్యం, కూటమి నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి, గూడూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కామధేను కాంప్లెక్స్ సమీపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన కలెక్టర్ వెంకటమురళి

బ్యాంకు లింకేజీపై అవగాహన

చీరాలటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు లింకేజీ రుణాలపై పొదుపు సంఘాలకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సెర్ప్ ఐబీ డైరక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం చీరాల మండల పరిధిలోని వెలుగు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. మండల సమాఖ్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే బుక్ కీపింగ్‌పై ఆరా తీశారు.

అమరజీవికి నివాళి

చీరాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలను పణంగా పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు మరవలేని వ్యక్తని మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎరువు .. దరువు

కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే యూరియా

కొన్ని చోట్ల అధిక ధరలకు విక్రయాలు

చీరాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చీరాల, పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ల పరిధిలో సాగులో ఉన్న పైర్లకు ఎరువులు వేస్తున్నారు. శనగ దుక్కులలో కూడా కొందరు ఎరువులను వెదపెడుతున్నారు. దీంతో ఎరువులకు గిరాకీ పెరిగింది. రైతులకు అవసరమైన మేర యూరియా దొరకటం లేదు. కొన్ని చోట్ల కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే యూరియా బస్తాలు ఇస్తామని ముడిపెడుతున్నారని రైతులు చెప్తున్నారు. ఇదిలా ఉంటే కొన్ని చోట్ల ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఫలితంగా రైతుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుని యూరియా కొరత లేకుండా చూడటంతో పాటు, అధిక ధరలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.



మోపెడ్‌లపై ఎరువుల బస్తాలను తీసుకెళ్తున్న రైతులు

క్రైం కార్నర్

ఇద్దరు నిందితుల అరెస్ట్

- రూ.2.57 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ శేషగిరిరావు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లోని విద్యుత్ మోటార్‌లు, పలు గేదెలను చోరీ చేసిన ఇద్దరు నిందితులను ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ శేషగిరిరావు ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెం కృపానగర్‌కు చెందిన బుడ్డాపు కిషోర్, దాసరి రాంబాబు చెడు వ్యసనాలకు బానిసలుగా మారారు. ఈక్రమంలోనే గ్రామంలో రెక్కీ నిర్వహించి పొలాల్లోని పలు విద్యుత్ మోటార్‌లు, గేదెల చోరీలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో అందిన ఫిర్యాదు మేరకు రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు నిందితులు ఇద్దరినీ శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అలాగే 13 మోటార్‌లు, 2 గేదెలు, 2 దూడలను స్వాధీనం చేసుకున్నారు. కేసులోని మరి కొందరు అనుమానితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితులపై కర్నూలు, చీరాల, కర్లపాలెం, కొత్తపట్నం, దర్శి టూటౌన్ స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. కేసును వేగవంతంగా చేదించిన ఎస్సై శివకుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

టీడీపీ, వైసీపీ వర్గాల కొట్లాట

బల్లికురవ. నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీలో దీపావళి బాణసంచా కాల్చే విషయమై టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య గురువారం రాత్రి కొట్లాటకు దారి తీసింది. అందిన సమాచారం మేరకు టీడీపీకి చెందిన మేరిబాబు బాణ సంచా కాల్చుతుండగా అదే కాలనీకి చెందిన వైసీపీ వర్గీయుడు యోహాన్ వచ్చి టపాయసులు తన ఇంటి మీద పడ్డాయని ఘర్షణకు దిగాడు. ఇద్దరి మధ్య వాదనలు జరుగుతుండగా వారి మధ్యలోకి వెళ్లిన టీడీపీకి చెందిన జొన్నలగడ్డ కరుణకు గాయాలు అయ్యాయి. వెంటనే టీడీపీ వర్గియులను గుంటూరు వైద్యశాలకు తరలించారు. తమపై యోహాన్, నాగరాజు వెంకటస్వామి దాడి చేశారని టీడీపీ వారు ఫిర్యాదు చేశారు. వైసీపీకి చెందిన యోహాన్ కూడా వైద్యశాలలో చేరినట్లు సమాచారం. శుక్రవారం ఇరు వర్గాలకు చెందిన వారు బల్లికురవ పోలీసుస్టేషన్‌కు చేరారు. వారం రోజుల వ్యవధిలోనే ఉప్పుమాగులూరు ఎస్సీ కాలనీలో ఘర్షణలు జరగటం రెండో సారి.

కారునుంచి మంటలు

పంగులూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారులో మంటలు చెలరేగాయి. ఈ ఘటన శుక్రవారం భగవాన్ రాజుపాలెం సమీపంలో పెట్రోలు బంక్ ఎదురుగా జరిగింది. నేషనల్ హైవే సిబ్బంది అందించిన సమాచారం మేరకు ఒంగోలు కోర్టు సెంటర్‌కు చెందిన కారు షోరూమ్ మేనేజర్ డి.శివకుమార్ శుక్రవారం ఉదయం ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు కారులో వెళుతున్నాడు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం వద్ద ఫ్లై ఓవర్ దిగుతుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కారులో మంటలు చెలరేగాయి. దీంతో శివకుమార్ రోడ్డు మార్జిన్‌లో కారు ఆపి దిగిపోయాడు. అద్దంకి ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. కారులో ప్రయాణిస్తున్న శివకుమార్ మంటలు గుర్తించి దిగిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని హైవే సిబ్బంది తెలిపారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

డివైడర్‌ను ఢీ కొన్న కారు

మేదరమెట్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అత్యవసర రన్‌వేలో కారు డివైడర్‌ను ఢీ కొన్న సంఘటనలో ఇరువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. శుక్రవారం గుంటూరు వైపు నుంచి ఒంగోలు వెళుతున్న కారు పి. గుడిపాడు-కొరిశపాడు మధ్య అత్యవసర రన్‌వేపై డివైడర్‌ను ఢీ కొంది. ఈ సంఘటనలో కారులోని ఇరువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. కారు ఢీ కొన్న సిమెంటు దిమ్మె ఒంగోలు , గుంటూరు రోడ్డు మధ్యకు వచ్చింది.

సంక్షిప్తంగా..

ఏఎస్ఐ సైదాకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి

మార్టూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి):మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న షేక్ సైదాకు ఎస్ఐ గా ప్రమోషన్ లభించింది. గత రెండేళ్లు నుంచి ఆయన స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్టేషన్ నుంచి రిలీవ్ అయ్యారు. అనంతరం జిల్లా కేంద్రం బాపట్ల ఎస్పీ కార్యాలయంలో సైదా రిపోర్టు చేశారు.

పేదల అభ్యున్నతికి దీపం - 2 పథకం దోహదం

అద్దంకి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదకుటుంబాల అభ్యున్నతికి దీపం 2 పథకం దోహద పడుతుందని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని చిన్నకొత్తపల్లిలో దీపం - 2 పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకరరావు, టీడీపీ నేతలు కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరకు నివాళి

అద్దంకిటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఉక్కు మహిళ అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. ఆమె 40వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఇందిరా నగర్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీ కార్యదర్శి సీహెచ్ మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, పీఎల్‌వీ నరసింహారావు, వెంకటేశ్వర్లు స్థానికులు పాల్గొన్నారు.



అద్దంకి పట్టణంలో దీపావళి సందర్భంగా బాణసంచా వెలుగులు

ఉత్సాహంగా దీపావళి

అద్దంకి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): దీపావళిని ప్రజలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి పిల్లలు, పెద్దలు, యువకులు మహిళలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ప్రధాన రోడ్ల వెంబడి షాపుల వద్ద కూడా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

చీరాలలో ఘనంగా

చీరాలటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ పరిధిలో గురువారం ఘనంగా దీపావళి పర్వదినాన్ని ప్రజలు నిర్వహించారు. బాణసంచా కాల్చుతూ వేడుకలు నిర్వహించారు. అలాగే స్థానిక ఎంజీసీ కాలనీలో 15 అడుగుల నరకాసురుని ప్రతిమను ఊరేగించి దహనం చేశారు. మరోవైపు ధరలు పెద్ద ఎత్తునే పేలినా కొనుగోలుకు ప్రజలు బాగానే ఉత్సాహం చూపారు.

వెలుగులీనిన లోగిళ్లు

చినగంజాం : మండల పరిధిలోని ప్రజలు దీపావళి పండుగను సందడిగా నిర్వహించారు. పెద్దలు, మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు ఆనందోత్సాహాల మధ్య బాణసంచా కాల్చారు. మహిళలు తమ ఇళ్ల లోగిళ్లలో ప్రమిదలను వెలిగించారు. గ్రామాలు టపాసుల మోతతో మారుమోగాయి.

● చీరాల ఎంజీసీ కాలనీలో 15 అడుగుల నరకాసురుని ప్రతిమ దహనం



చీరాలలో రిక్షాపై నరకాసురుని ప్రతిమను ఊరేగిస్తున్న స్థానికులు